

సముద్రంలో దొరికిన వస్తువును కట్ చేస్తుండగా పేలుడు?



- వెల్డింగ్ దుకాణంలో ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు
- ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక వచ్చేంత వరకూ స్పష్టమైన అంచనాకు రాలేమంటున్న పోలీసులు

6లో

దర్జాగా గ్రీన్‌బెల్ట్ కబ్జా

జాతీయ రహదారికి ఇరువైపులా ఎక్కడికక్కడ ఆక్రమణలు

- నర్సరీలు, మాంసం విక్రయాలు, గ్యారేజీలు, పశువుల పెంపకం...
- దుకాణాలు పెట్టుకుని అద్దెకు ఇస్తున్న మరికొందరు
- పట్టించుకోని జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు
- ఇలాగే వదిలేస్తే రానున్న రోజుల్లో పూర్తిగా కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదంటున్న నగరవాసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకుగాను జాతీయ రహదారికి ఇరుపక్కలా అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్ అన్యాక్రాంతమైపోతోంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు దశాబ్దాల కిందట రహదారికి ఇరువైపులా చెట్లను నాటారు. అవి ఏపుగా పెరిగి వాహన చోదకులకు వేడి నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడుతున్నాయి. కానీ కొంత మంది ఆ గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి దుకాణాలు పెట్టుకుంటున్నారు. మరికొందరు ఏకంగా అద్దెకు ఇచ్చి ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన జీవీఎంసీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు చోద్యం చూస్తున్నారు.



విశాలాక్షినగర్ వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో సరుగుడు కర్రలడిపో

జాతీయ రహదారిపై భారీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాలుష్యం కూడా అదే స్థాయిలో ఉంటుంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్ల గాలి స్వచ్ఛత దెబ్బతిని ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. దీనిని అధిగమించేందుకు వీలుగా జాతీయ రహదారికి ఇరువైపులా గ్రీన్ బెల్ట్ పేరుతో ప్రత్యేకంగా భూమిని కేటాయించారు. అందులో రకరకాల మొక్కలు నాటారు. అవన్నీ ఏపుగా పెరిగి చల్లని నీడ ఇవ్వడంతోపాటు కాలుష్య నియంత్రణకు దోహదపడుతున్నాయి. గ్రీన్‌బెల్ట్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత నేషనల్ హైవేస్ అథారిటీ ఇండియాదే అయినప్పటికీ నగర పరిధిలో గ్రీన్‌బెల్ట్ నిర్వహణను జీవీఎంసీ చూస్తోంది. అయితే గ్రీన్‌బెల్ట్ పరిరక్షణ విషయంలో నగర పాలక సంస్థ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కడికక్కడ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. కొందరు గ్రీన్ బెల్ట్‌లోని చెట్లను నరికేసి దర్జాగా దుకాణాలు పెట్టుకుంటున్నారు. మరికొందరైతే ఏకంగా దుకాణాలు ఏర్పాటుచేసి అద్దెకు ఇచ్చి ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. వీరందరికీ చోటామోటా రాజకీయ నేతలు అండగా ఉండడంతో కిందిస్థాయి అధికారులు చూసినా సరే...వాటి జోలికి వెళ్లడానికి సాహసించడం లేదు. ఆదర్శనగర్ జంక్షన్ వద్ద గ్రీన్ బెల్ట్‌లో పింగాణీ వస్తువులు విక్రయిస్తున్నారు. విశాలాక్షి నగర్ వద్ద ఒకవైపు నాటుకోళ్ల దుకాణాలు, మాంసం దుకాణాలు, వాటిని ... మిగతా 6వ పేజీలో



ఆదర్శనగర్ జంక్షన్ వద్ద పింగాణీ వస్తువుల విక్రయం



మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు



జీసీసీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గిరిజన సాధికారతకు కట్టుబడి ఉన్నా

ఏజెన్సీ అభివృద్ధికి కృషిచేస్తా

- ఎకో టూరిజానికి రూ.10 కోట్లు
- మోదకొండమ్మ ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు
- ఏజెన్సీ అందాలు ఎంతో ఆకట్టుకున్నాయి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రకటన

పాడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీ అభివృద్ధికి, గిరిజనుల సాధికారతకు తాను కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం లగిశపల్లిలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటక రంగం ద్వారా గిరిజనులకు పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తామన్నారు. ఎకో టూరిజం అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. పాడేరు మోదకొండమ్మ ఆలయం ... మిగతా 6వ పేజీలో



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పలకరిస్తున్న చంద్రబాబునాయుడు


ఉక్కు యాజమాన్యం దాగుడుమూతలు

ఒకపక్క లాభాల్లోకి తేవడానికి యత్నిస్తున్నాం అంటూనే మరోపక్క ఒక్కో విభాగం ప్రైవేటీకరణ

- ఎస్ఎంఎస్-2లో క్రేన్ల నిర్వహణకు తాజాగా టెండర్‌ల ఆహ్వానం
- కన్వేయర్ల నిర్వహణ, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు కూడా...
- ప్రమాదాలు జరిగేది అక్కడే... అదే అప్పగింతకు యత్నం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుపై యాజమాన్యం దాగుడుమూతలాడుతోంది. ప్లాంటును లాభాల బాటలోకి తేవడానికి యత్నిస్తున్నామని, కేంద్రం నిధులు ఇచ్చిందని ఒకవైపు చెబుతూ, మరోవైపు ఒక్కో విభాగాన్ని ప్రైవేటుకు అప్పగిస్తోంది. వారి మాటలు, చేతలకు పొంతన ఉండడం లేదు. వేల సంఖ్యలో ఉద్యోగులను తగ్గిస్తూ 100 శాతం ఉత్పత్తి పేరుతో అదనంగా రోజుకు నాలుగు గంటలు పనిచేయిస్తున్నారు. లాభాలు వస్తున్నా ఇంకా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. మూడు నెలల బకాయి ఉంది. తాము అనుకున్నదే చేస్తామనే రీతిలో ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు.



తాజాగా ఎస్ఎంఎస్-2 ప్లాంటులో సుమారుగా 12 క్రేన్ల నిర్వహణ, కన్వేయర్ బెల్ట్‌ల హౌస్ కీపింగ్ పనులను ప్రైవేటుకు అప్పగించేందుకు టెండర్ పిలిచారు. రెండేళ్ల నిర్వహణకు అంచనాగా రూ.14.55 కోట్ల వ్యయం అవుతుందని, అర్హతలు కలిగిన సంస్థలు టెండర్లు దాఖలు చేయాలని యాజమాన్యం పిలుపునిచ్చింది.

బ్లాస్ట్ ఫర్నేస్‌లలో తయారైన హాట్ మెటల్ (ద్రవ రూపంలోని స్టీల్)ను ల్యాడిల్స్ (గుండ్రటి భారీ బిందెల ఆకారంలో ఉంటాయి) ద్వారా క్రేన్ల సాయంతో స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్) విభాగానికి తీసుకువస్తారు. ల్యాడిల్స్ అన్నీ క్రేన్లతోనే ఆపరేట్ చేస్తారు. ఈ ప్రక్రియలోనే తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒక్కో ల్యాడిల్‌లో 150 టన్నుల ఉక్కు ద్రవం ఉంటుంది. క్రేన్ ఏ మాత్రం బ్యాలెన్స్ తప్పినా ల్యాడిల్ వంగి అందులో ద్రవం నేలపాలవుతుంది. అది ఏ కార్మికుడిపై పడినా నామరూపాలు ఉండవు. అదేవిధంగా నష్టం కూడా లక్షల రూపాయల్లో ఉంటుంది. మూడు దశాబ్దాలుగా అదే పనిచేస్తున్న సిబ్బంది నిర్వహణలోనే తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇప్పుడు ఎవరో కొత్తవారు వచ్చి వాటిని ఆపరేట్ చేస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుతుందా?, పెరుగుతుందా?...అనేది యాజమాన్యం వెల్లడించాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. క్రేన్ల ఆపరేషన్ ఒక్కటే కాకుండా వాటికి సంబంధించిన కన్వేయర్ల నిర్వహణ, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులన్నీ ఏజెన్సీయే చేయాలని నిబంధన పెట్టారు. ఇది క్లిష్టమైన ప్రక్రియ. దీనిని చిత్తశుద్ధితో పనిచేసే వారే నిర్వహించగలరు. కాంట్రాక్టుపై బయటవారు చేస్తే ... మిగతా 6వ పేజీలో

చిన్న వయసులోనే దృష్టి లోపం

పిల్లల్లో అధికమవుతున్న కంటి సమస్యలు

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షల నిర్వహణ
- ఇప్పటివరకూ 71 స్కూళ్లలోని 8,789 మందికి నిర్వహణ
- 859 మందిలో సమస్య గుర్తింపు
- గంటల తరబడి ఫోన్ వినియోగం, పోషకాహార లోపం ప్రధాన కారణాలు

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):

దృష్టి లోపం సమస్యతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు తరగతి గదిలో ఒకరిద్దరు మాత్రమే కళ్లద్దాలతో కనిపించేవారు. ఇప్పుడు కొంతమందికి స్కూల్‌లో చేరే సమయానికి కంటి అద్దాలు అవసరమవుతున్నాయి. పిల్లల్లో కంటి సంబంధిత సమస్యలు పెరుగుతున్నట్టు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జాతీయ అంధత్వ నివారణ ప్రోగ్రామ్‌లో భాగంగా అందరికీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. జూలై 21న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబరు 31 వరకూ కొనసాగనున్నది.



పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు

పది మందిలో ఒకరికి..

జిల్లాలోని 595 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఆరు నుంచి 18 ఏళ్లలోపు వయసున్న 54 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. వీరిలో 34,500 మందికి పరీక్షలు నిర్వహించే బాధ్యతను ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు ప్రభుత్వం అప్పగించింది. వీరిలో 4,500 మందికి దృష్టి దోషం ఉంటుందని, అందులో సుమారు 3,600 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకూ 71 స్కూళ్లలోని 8,789 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 859 మంది దృష్టిలోపంతో బాధపడుతున్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో 721 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయని నిర్ధారించారు. మరో 128 మందికి అదనపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని నిర్ధారించి ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు.

కంటిపై ఒత్తిడి

కంటి సమస్యతో బాధపడుతున్న చిన్నారులు చూడడానికి, పుస్తకాలు చదవడానికి, రాయడానికి కంటిపై తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నట్టు గుర్తించారు. కళ్లలో మంటగా ఉంటున్నట్టు, కళ్ల వెనుక భాగంలో నొప్పి ఉంటున్నట్టు పలువురు విద్యార్థులు వెల్లడించారు. అదేవిధంగా ఎక్కువ మంది విద్యార్థులు చేతితో కంటిని నలపడం వంటివి చేస్తున్నట్టు వైద్యులు గుర్తించారు.

బృందాల నియామకం

ప్రస్తుతం స్కూల్స్‌కు వెళ్లి ఈ తనిఖీలను చేపడుతున్నారు. ఈ కంటి పరీక్షలు కోసం పది బృందాలను ... మిగతా 6వ పేజీలో

క్రాస్‌ఓటింగ్‌పై జనసేన పోస్టుమార్టం

- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏడుగురు కార్పొరేటర్లు వైసీపీ అభ్యర్థులకు ఓటు వేసినట్టు గుర్తింపు
- అధిష్ఠానానికి నివేదిక

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):

కౌన్సిల్‌లో మెజారిటీ ఉన్నప్పటికీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఒక స్థానం కోల్పోవడంపై కూటమి పార్టీలు పోస్టుమార్టం ప్రారంభించాయి. వైసీపీ తరపున కార్పొరేటర్లుగా గెలిచి జనసేనలో చేరిన కొందరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారంటూ కూటమి నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశాల మేరకు స్థానిక జనసేన నేతలు తమ కార్పొరేటర్ల ఓటింగ్‌పై ఆరా తీశారు. వైసీపీ నుంచి తమ పార్టీలో చేరిన 11 మందిలో ఏడుగురు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడినట్టు గుర్తించినట్టు ఆ పార్టీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు. ఇండిపెండెంట్‌గా గెలిచి జనసేనలో చేరిన ... మిగతా 6వ పేజీలో

బదిలీ టీచర్లకు అందని జీతాలు

- ఉమ్మడి జిల్లాలో 1,200 మంది ఎదురుచూపు
- ఇప్పటికి రెండు నెలలు పెండింగ్
- విద్య, ఆర్థిక శాఖల మధ్య సమన్వయలోపమే కారణం

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):

రెండు నెలల క్రితం బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో పలువురికి ఇంతవరకూ జీతాలు అందలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి మేరకు కొత్తగా మంజూరుచేసిన పోస్టుల్లోకి వెళ్లినవారు ఉమ్మడి జిల్లాలో సుమారు 1,200 మంది ఉన్నారు. వారి జీతాల బిల్లుల అప్‌లోడ్‌కు అవసరమైన పొజిషన్ ఐడీల ఏర్పాటులో పాఠశాల విద్యా శాఖ, ఆర్థిక శాఖ మధ్య సమన్వయం కొరవడింది. దీంతో జూన్, జూలై జీతాలు అందలేదు. దీనిపై ఉపాధ్యాయులు రెండు నెలల నుంచి ఆందోళన వ్యక్తంచేస్తున్నా విద్యా శాఖ స్పందించడం లేదనే వాదన వినిపిస్తోంది.



జూన్ నెలలో ఉమ్మడి జిల్లాలో సుమారు ఐదు వేల మందిని బదిలీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఉన్న పోస్టుల్లోకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతం విషయంలో ఇబ్బంది లేదు. సుమారు 3,800 మంది టీచర్లకు జీతాలు బట్వాడాలో సమస్యలు లేవు. అయితే గత ప్రభుత్వం అమలుచేసిన జీవో 117 రద్దు తరువాత తీసుకువచ్చిన జీవోల మేరకు పలు రకాల పాఠశాలలు ఏర్పాటుచేసి అక్కడ విద్యార్థుల సంఖ్య మేరకు టీచర్లను నియమించారు. దీనికితోడు కొన్నిచోట్ల అదనపు సెక్షన్లు ఏర్పాటుచేయడంతో అక్కడ కూడా పోస్టులు కేటాయించారు. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి మేరకు కొన్నిచోట్ల మిగిలిన టీచర్లను అవసరం ఉన్న చోట, కొత్తగా ఏర్పాటుచేసిన ... మిగతా 6వ పేజీలో

ఖైదీలకు రాఖీ కట్టిన హోంమంత్రి అనిత



కేంద్రకారాగారంలో ఖైదీలు, సిబ్బందికి రాఖీ కడుతున్న రాష్ట్రహోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్రహోంశాఖా మంత్రి వంగలపూడి అనిత శనివారం కేంద్ర కారాగారానికి వెళ్లి ఖైదీలతోపాటు జైలు సిబ్బందికి రాఖీలు కట్టారు. 30 మంది ఖైదీలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. యువత మంచిచెడులు తెలుసుకుని ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. యువ ఖైదీలతో మాట్లాడుతూ గంజాయి రవాణా చేసి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. బతకడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని జీవితంలో పైకి రావాలని పిలుపునిచ్చారు. వచ్చే రాఖీపండుగను ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి జరుపుకునే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. జైలులోని అధికారులు, సిబ్బందికి కూడా రాఖీలు కట్టి సోదరభావాన్ని పంచుకున్నారు.



జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్

ఎండాడ హైవేపై ట్రాఫిక్ జామ్



ప్రమాదానికి గురైన కారు

ఎండాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం భారీ ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. నగరం నుంచి వస్తున్న ట్రాలీ, కారును ఢీకొనడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. కారు ముందు భాగం దెబ్బతినడంతో ట్రాలీ డ్రైవర్‌తో కారు యజమాని వాగ్వాదానికి దిగారు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు. పీఎంపాలెం పోలీసులు వచ్చి ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఒక వైపు రాఖీ పండగ, మరోవైపు పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో ఏపీఎల్ మ్యాచ్‌లు ఉండడంతో వాహనాల రద్దీ పెరిగింది.

70 మందికి నేత్ర వైద్య పరీక్షలు



ఎండాడ ఎస్సీ కాలనీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఎండాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ ఎస్సీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. నియో విజన్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు 70 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, భీమిలి నియోజకవర్గం టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు చినగోపి, వార్డు తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు, బెల్లాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాతపేటలో...

భీమునిపట్నం (రూరల్) : చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో తాళ్లవలస పంచాయతీ యాతపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింహాచలం శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు 50 మందికి పరీక్షలు చేసి, 15 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, డా.ఎస్. భారతి, ఎంవీ సత్యసాయికుమార్, జోనల్ సమన్వయకర్త డి. శరత్‌కుమార్, వి. పైడిరాజు, సేవాదళ్ తొలేటి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో లఘు నాటిక పోటీలు

భీమునిపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కళాసాహితి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు శనివారం లఘు నాటిక పోటీలు నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ పోటీలకు 11 ఉన్నత పాఠశాలల నుంచి 16 నాటికలు పోటీకి వచ్చాయి. తొలిరోజు పది నాటికలను, నాలుగు నృత్యాలను ప్రదర్శించారు. ఆదివారంతో పోటీలు ముగియనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాటికల పట్ల ఆసక్తి పెంచడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బహుమతి రాకపోయినా పోటీ చేయాలన్న ఆలోచన విద్యార్థుల్లో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాసాహితి అధ్యక్షుడు పి. రాజేంద్రప్రసాద్‌వర్మ, ఎంఈఓలు డొకర శ్రీనివాసరావు, ఎం.శివరాణి, నిర్వాహకులు రేలంగి అప్పలనర్సయ్య, టి. భీమారావు, పుసులూరి సూరిబాబు, ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం పి. రమణ, కె. సన్యాసిరాయుడు, టి. కోటేశ్వరరావు, అడిదం కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత

మధురవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని కారుషెడ్ నుంచి కొమ్మాది కూడలి వరకు కాలువల్లో పూడికతీతలు చురుగ్గా జరుగుతున్నాయి. పనులు మందకొడిగా సాగడం పట్ల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సిబ్బందిపై ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈమేరకు జడ్సీ కనకమహాలక్ష్మీ పర్యవేక్షణలో రెండు రోజులుగా పనులను వేగవంతం చేశారు.

శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఎస్ఓఎస్ యాప్‌పై అవగాహన



స్థానికులకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సింహాచలం

మధురవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారిని సత్వరమే ఆదుకునేందుకు ఎస్ఓఎస్ (సేవ్ అవర్ సోల్) యాప్‌ను ప్రవేశపెట్టినట్టు పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఎం. సింహాచలం తెలిపారు. శనివారం ఆయన మధురవాడ కూడలిలో యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారు, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు,అసాంఘిక కార్యకలాపాలు కంటపడినప్పుడు ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. మహిళలు, బాలికలు, యువతులు, విద్యావంతులు సెల్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

పరీక్షల నిర్వహణలో నూతన ఒరవడి

- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- డీఈఓ ప్రేమ్‌కుమార్
- వెల్లంకి హైస్కూల్, భీమిలి కేజీబీవీ సందర్శన

ఆనందపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ శనివారం సందర్శించారు. సోమవారం నుంచి జరగనున్న పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్ లెట్స్, వాటి రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం పాఠశాల లైబ్రరీని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పరీక్షా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందన్నారు. గతంలో పేపర్లపై విద్యార్థులు పరీక్షలు రాసేవారని, ఇప్పుడు ప్రతి విద్యార్థికి ఏడాదిలో నిర్వహిస్తున్న ప్రతి పరీక్షకు ఒక బుక్ లెట్ ఇచ్చి అందులోనే పరీక్ష రాయిస్తారని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ కె. గంగరాజు, హైస్కూల్ హెచ్‌ఎం దాడిశెట్టి రమేశ్‌కుమార్, డీసీఈబీ సెక్రటరీ శ్రీకృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వెల్లంకిలో బుక్ లెట్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

కేజీబీవీని సందర్శించిన డీఈఓ

భీమునిపట్నం : పట్టణంలోని కేజీబీవీని డీఈఓ ప్రేమ్‌కుమార్ సందర్శించారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. బాలికలతో మాట్లాడి అభ్యాసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి, జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి కృష్ణకుమార్, ఎంఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లోని వెల్డింగ్ షాపులో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఈమేరకు హోం మంత్రి వంగలపూడి అనిత వెల్డింగ్ షాప్ యజమాని చల్లా గణేశ్ భార్య సుధకు, ముత్యాలనాయుడు భార్య ప్రమీలాకు, శ్రీనివాస్ భార్య లక్ష్మికి వారి నివాసాలకు వెళ్లి శనివారం చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులు ఎల్లాజీ రంగారావు, సన్యాసి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. వెల్డింగ్ షాపు సమీ పంలో ఉన్న దుకాణదారులకు కూడా ప్రమాద సమయంలో స్వల్ప గాయాలయ్యాయని, వారికి కూడా వైద్యం అందించాలని సూచించారు. ఫోరెన్సిక్ నిపుణుల దర్యాప్తు జరుగుతుందని, పేలుడుకు గల కారణాలపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని చెప్పారు. సముద్రంలో దొరికిన వస్తువులను భద్రపరచడం, వాటి సమాచారం అధికారులకు అందించడంపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ నాయకుడు సుధాకర్, పాల్గొన్నారు.



మృతుడి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న హోం మంత్రి అనిత, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉన్నారు.

అనంతుని విగ్రహానికి అద్దాల మండపం

పద్మనాభం,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిపై ఉన్న అనంత పద్మనాభుని ఆలయంలో శేషపాన్పుపై ఉన్న అనంతుని విగ్రహానికి శనివారం అద్దాల మండపం ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తాలాడ రామకృష్ణ, యశోద దంపతులు ఈ మండపానికి ఆర్థిక సాయం అందించారు.

వెంకన్న సన్నిధిలో శ్రవణ నక్షత్ర హవనం

సింహాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కొండ దిగువన ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్ర హవనం శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామివారి ఆవిర్భావ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ప్రతి మాసంలో వచ్చే శ్రవణం రోజున లోక కల్యాణార్థం సుదర్శన హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు ప్రభాతారాధనలు ముగిసిన తరువాత ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై యజ్ఞమూర్తిగా సుదర్శనమూర్తిని ఉంచారు. ఆగమశాస్త్ర విధానం ప్రకారం బింబారాధన, కలశారాధన, మండపారాధన చేసి ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. అనంతరం రుత్విక్‌లు పంచసూక్తాలతో తొలుత, తరువాత సుదర్శన మూల, మూర్తి మంత్రాలతో హవనం చేసి పూర్ణాహుతి చేశారు. ప్రధాన కలశంలోని పవిత్ర జలాలతో ప్రోక్షణ చేసి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎల్‌వీ పాలెంలో అక్రమ భవన నిర్మాణం నిలిపివేత

ఆనందపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు శనివారం నిలుపుదల చేశారు. సర్వే నెంబరు 281పిలో సుమారు పది సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం చేస్తున్నట్టు ఫిర్యాదు అందడంతో ఆర్ఐ అవినాష్, వీఆర్ఓ అప్పారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు అయిదు సెంట్లు వరకు ప్రభుత్వ స్థలం ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నట్టు గుర్తించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి బోరుకు కేటాయించిన స్థలాన్ని కూడా ఆక్రమించినట్టు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ అవినాష్ తెలిపారు. కాగా పంచాయతీలోని ఎస్సీ కాలనీలో గృహ అవసరాల నిమిత్తం విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. కొంతమంది విద్యుత్ స్తంభాలకు కేటాయించిన స్థలాన్ని కూడా ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మించారు. ఈ విషయమై ఫిర్యాదులు ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం



ఈఓ త్రినాథరావుకు చెక్కు అందజేస్తున్న మావూరి వెంకటరమణ

సింహాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఆయన కుమారుడు బాలాజీ రూ2 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో శనివారం వారు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావుకు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

'దళితులపై దాడులను అరికట్టాలి'

ఆనందపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఇంట్లో ఆయన అనుచరులు దళిత యువకుడ్ని బంధించి దాడి చేసిన ఘటనను నిరసిస్తూ ఎల్‌వీపాలెం ఎస్సీ కాలనీలో మండల మాల మహానాడు అధ్యక్షుడు సియ్యాద్రి రాంబాబు ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. తొలుత పలువురు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు, నియోజకవర్గం అధ్యక్షుడు బోని సన్నిబాబు, దళిత నాయకులు పైడిరాజు, ముకుందరావు, రామారావు, ఎజ్జల దాసు, బోని ముత్యాలు, నిమ్మకాయల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదాగమ పాఠశాలలో నూతన యజ్ఞోపవీతధారణ

సింహాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాద, వేద, ఆగమ పాఠశాలలో విద్యార్థులు శనివారం నూతన యజ్ఞోపవీత ధారణ చేసుకున్నారు. వేదాలు నేర్చుకునే విద్యార్థులు ఏటా శ్రావణ మాసం శుక్లపక్ష పూర్ణిమనాడు నూతన యజ్ఞోపవీత ధారణ చేయాల్సి ఉంది. ఈమేరకు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు స్వీయ పర్యవేక్షణలో విద్యార్థులతో నూతన యజ్ఞోపవీతాలను ధరించి, విశేష హోమాలు, ప్రత్యేక జపాలను పఠించారు.

క్రాస్ ఓటింగ్‌పై జనసేన పోస్టుమార్టం

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్ ఒకరు...ఏడు ఓట్లు కూటమి అభ్యర్థులకు కాకుండా వైసీపీ నుంచి పోటీ చేసిన వారికి వేసినట్టు స్పష్టమైందన్నారు. అలాగే మరో ఆరుగురు కూడా వైసీపీ అభ్యర్థులకు ఓటు వేసినట్టు గుర్తించామన్నారు. దీనిపై అధిష్ఠానానికి నివేదిక పంపిస్తామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని వివరించారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

కొమ్మాది, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి బి. సురేశ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం మారికవలస గిరిజన బాలుర పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాచీనకాలానికి, ఇప్పటికి గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతిలో వచ్చిన మార్పులను వివరించారు. అనంతరం శంభువానిపాలెం గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు దేవుడుబాబును ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

పద్మనాభం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రాఖీ పౌర్ణమి శనివారం ఘనంగా జరిగింది. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు స్థానిక మహిళా నాయకులు టి.నాగమణి, ఎస్. భారతి తదితరులు నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ రాంబాబుకు, టీడీపీ మండల సీనియర్ నాయకుడు నగేష్‌కుమార్‌కు వారి సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు చెప్పారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం



మాడవీధిలో స్వామివారి తిరువీధి

సింహాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం సింహగిరి మాడవీధుల్లో శనివారం వైభవంగా జరిగింది. రాత్రి ఆరాధన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో సర్వ స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల మంగళవాయిద్యాలు, పండితులు వేదపఠనాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలిచ్చి స్వాగతించారు.

సముద్రంలో దొరికిన వస్తువును కట్ చేస్తుండగా పేలుడు ?

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో దొరికిన వస్తువును కట్ చేసే క్రమంలోనే హార్బర్ సమీపంలో పేలుడు సంభవించిందని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. గురువారం సాయంత్రం వెల్డింగ్ దుకాణంలో జరిగిన పేలుడులో ముగ్గురు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడే కారణమని మొదట్లో అందరూ భావించారు. కానీ పోలీసులు, ఫోరెన్సిక్ బృందం గ్యాస్ సిలిండర్ కారణంగా పేలుడు జరగలేదని నిర్ధారించినట్టు సమాచారం. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి ఏదో ఒక వస్తువు దొరకగా, దానిని వారు స్క్రాప్ దుకాణంలో విక్రయించారు. దానిని కట్ చేయాలంటూ స్క్రాప్ దుకాణం యజమాని పక్కనే ఉన్న వెల్డింగ్‌షాపు యజమాని గణేష్‌కు ఇచ్చారు. దానిని కట్టర్‌తో కట్ చేస్తుండగా పేలుడు జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక వచ్చేంత వరకు స్పష్టమైన అంచనాకు రాలేమని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సన్యాసిరావును మెరుగైన వైద్యం నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

దర్జాగా గ్రీన్‌బెల్ట్ కబ్జా

... 5వ పేజీ తరువాయి

అనుకునే సరుగుడు కర్రల విక్రయ కేంద్రం ఏర్పాటుచేశారు. వాటికి ఎదురుగా జాతీయ రహదారికి మరోవైపు జీవీఎంసీ పేరుతో ఒకరు వాహనాల రిపేరు చేసే మెకానిక్ షెడ్‌ను ఏర్పాటుచేసి గ్యారేజీగా మార్చేశారు. హనుమంతవాక జంక్షన్ సమీపంలో ఒకరు నర్సరీని గ్రీన్ బెల్ట్‌లోనే ఏర్పాటుచేశారు. వెంకోజీపాలెం జంక్షన్ వద్ద పాత ఇంటి సామగ్రి విక్రయించే దుకాణాలు, సరుగుడు దుకాణాలు, కార్పెంటర్ల దుకాణాలు వెలిశాయి. ఇసుకతోట జంక్షన్ సమీపంలో గ్రీన్‌బెల్ట్‌ను పూర్తిగా తొలగించేసి కార్ డెకార్స్, మెకానిక్ షెడ్‌లు, మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ సమీపంలో ఏకంగా ఫ్రీ వెండింగ్‌జోన్ పేరుతో ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, గురుద్వార శ్మశానవాటిక పక్కన కారు, ఏసీ రిపేర్లు చేసే మెకానిక్ గ్యారేజీ ఏర్పాటుచేసేశారు. మర్రిపాలెం పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద గ్రీన్ బెల్ట్‌లో ఎండుగడ్డిపైకప్పుతో ఒక షెడ్ నిర్మించేసి అందులో ఆవులు పెంపకం చేస్తున్నారు. గ్రీన్‌బెల్ట్ ఆక్రమణకు గురవుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులుగానీ, ఇంజనీరింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎవరైనా గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళితే ఆ విషయం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చూసుకోవాలని, వారు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కూడా కళ్లముందు ఆక్రమణలు కనిపిస్తున్నా జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదుచేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా అధికారులు గ్రీన్‌బెల్ట్ ఆక్రమణపై జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో గ్రీన్‌బెల్ట్ పూర్తిగా కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు.

గిరిజన సాధికారతకు కట్టుబడి ఉన్నా

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి రెండు కోట్లు కావాలని అడిగారని, వాటిని ఇస్తానని హామీ ఇచ్చారు. పాడేరు రావడం తన అదృష్టంగా సీఎం పేర్కొన్నారు.ఏజెన్సీ అందాలు తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఇక్కడికి వస్తే ఆనందంతో పాటు ధైర్యం కూడా వస్తుందన్నారు. ఇక్కడి ప్రజలు కూడా మంచివారని, వారి మనసుల్లో ఎటువంటి కలుషితం లేదన్నారు. సంపద అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. పాడేరు దిశ, దశ మారేలా తాను అభివృద్ధి చేస్తానన్నారు. పాడేరులో మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తానన్నారు. ఏజెన్సీకి రావడానికి డాక్టర్లు ఆసక్తి చూపడం లేదని, వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చి రప్పిస్తామన్నారు. దీపం పథకం ఈ ప్రాంత ప్రజలకు అందలేదని ఆలస్యంగా తెలిసిందని, ఈ నెలలోనే అందరికీ ఉచితంగా గ్యాస్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏజెన్సీలో ఆరు లక్షల ఎకరాల్లో వెదురు ఉందని, అది డ్వాక్రా గ్రూపులకు ఉపయోగపడేలా ప్రాజెక్టుకు ఎంఓయూ చేశామని, దీని వల్ల ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఒక్కొక్కరికి ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం వస్తుందన్నారు.

చిన్న వయసులోనే దృష్టిలోపం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసినట్టు ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ మీనాక్షి తెలిపారు. ఒక్కో బృందంలో పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆశ వర్కర్, ఏఎన్‌ఎం ఉంటారు. వీరంతా వారికి కేటాయించిన షెడ్యూల్ మేరకు స్కూల్స్‌కు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు.

కారణాలు

చిన్నారులు కంటి సమస్యలతో బాధపడు తుండడానికి అనేక అంశాలు దోహదం చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇందులో ప్రధాన కారణం చిన్న వయసు నుంచే గంటల తరబడి ఫోన్ వినియోగించడంగా చెబుతున్నారు. అలాగే పోషకాహార లోపం, గర్భిణిగా ఉన్న సమయంలో తల్లి పోషకాహారాన్ని తీసుకోకపోవడం, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు కళ్లద్దాలు విని యోగించడం, తీవ్రమైన ఒత్తిడి, విటమిన్లు సమస్య, ఒంటరితనం, చదువులో వెనుకబాటు, వెలుతురు సరిగా లేని చిన్నపాటి గదుల్లో తరగతులు నిర్వహించడం వంటి అంశాలు కారణమవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

తప్పనిసరిగా పరీక్షలు చేయించాలి

- డాక్టర్ మీనాక్షి, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రామ్ అధికారి

గతంతో పోలిస్తే చిన్నారుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న వయసులోనే టీవీలకు అలవాటు పడడం ప్రధాన కారణంగా ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి.చదువుతున్నప్పుడు, రాస్తున్నప్పుడు పిల్లలు కంటిపై ఒత్తిడి పడుతున్నట్టు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. పిల్లలకు కంటి ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలను రోజువారీ ఆహారంలో ఉండేలా చూడాలి. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. దీనివల్ల సమస్యను గుర్తించేందుకు అవకాశం ఉంది.

బదిలీ టీచర్లకు అందని జీతాలు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలకు పంపించారు. దీనికి ఆర్థిక శాఖ నుంచి ముందుగా అనుమతి తీసుకోలేదు. అందువల్లే బదిలీపై నియమించిన టీచర్లకు జీతాలు బట్వాడాలో సమస్య ఉత్పన్నమైంది. జూన్ మూడో వారంలో ఈ సమస్య గుర్తించినా ఉన్నతస్థాయి నుంచి ఆదేశాల జారీకి తీవ్ర జాప్యం ఏర్పడింది. దీంతో ఆ నెల బిల్లులు అప్‌లోడ్ కాలేదు. సాధారణంగా నిర్ణీత గడువులోగా అప్‌లోడ్ చేయని బిల్లులు మరుసటి నెల అంటే జూలై ఆరు నుంచి పదో తేదీలోగా అప్‌లోడ్ చేయాలి. అయితే జీతం బిల్లు అప్‌లోడ్ చేయాలంటే ప్రతి టీచర్‌కు పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంది. గత నెలలో ఆ పనిచేయలేదు. నెలాఖరున అప్‌లోడ్‌కు పొజిషన్ ఐడీ సమస్య వచ్చింది. దీంతో జూలై నెల జీతం రాలేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 1,200 మంది టీచర్లు రెండు నెలల నుంచి జీతాలకు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జీతాల విడుదలకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ కోరారు.

ఉక్కు యాజమాన్యం దాగుడు మూతలు

... 5వ పేజీ తరువాయి

ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

ఒక్కో విభాగం ఒక్కొక్కరికి...

ఏదైనా బస్సును నడుపుతున్నప్పుడు స్టీరింగ్ ఒకరు పట్టుకొని, గేర్లు ఒకరు మారుస్తూ, బ్రేకులు ఇంకొకరు వేస్తుంటే... ఆ బస్సు ఎలా నడుస్తుందో...ఇప్పుడు స్టీల్ ప్లాంటు పరిస్థితి కూడా అలాగే ఉందని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఒక్కో విభాగాన్ని ఒక్కొక్కరికి అప్పగిస్తూ సమన్వయం లేకుండా చేస్తున్నారని, ఇది పూర్తిగా స్టీల్ ప్లాంటును నిర్వీర్యం చేస్తుందని ఉద్యోగులు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

రాఖీ సందడి... రోడ్లన్నీ రద్దీ

అడుగడుగునా ట్రాఫిక్ జామ్..


వెంకోజీపాలెం సిగ్నల్స్ వద్ద రోడ్డు మధ్యలో నిలిచిపోయిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పండుగ సందర్భంగా శనివారం రహదారులు కిక్కిరిశాయి. ఓ పక్క వారాంతం, మూడు రోజుల వరుస సెలవులు, రక్షాబంధన్‌లో భాగంగా అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు, సోదరీమణులకు బహుమతులు అందజేసేందుకు అన్నదమ్ముల షాపింగ్‌లు.. ఇలా ఎవరి బిజీలో వారు రాకపోకలు సాగించడంతో అన్ని ప్రాంతాలు రద్దీగా కనిపించాయి. చిన్నా పెద్దా లేకుండా రాఖీ పండుగ జరుపుకోవడానికి అంతా ఉత్సాహం చూపారు. పలు ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఏర్పడింది. రహదారులు కిక్కిరిశాయి. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రహదారులపై మరింతగా సందడి కనిపించింది.

ఇసుకతోట ఐసీఐసీఐ కూడలి నుంచి డెయిరీ ఫారం ఆదర్శనగర్ జంక్షన్ వరకూ కూడళ్లలో వాహనాలు బారులు తీరాయి. ఒక కిలోమీటరు దూరం ప్రయాణించడానికి కనీసం అరగంట పట్టింది. ఓ పరిస్థితిలో హనుమంతువాక నుంచి వెంకోజీపాలెం వరకూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎంవీపీ వైపు నుంచి జాతీయ రహదారి పైకి వచ్చిన వాహనాలు రోడ్డు మధ్యలోనే ఆగిపోవాల్సి వచ్చింది. శనివారం రాత్రి తొమ్మిదిన్నర వరకూ పరిస్థితి ఇలాగే కొనసాగింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి సిగ్నల్ లైట్లు ఆపేసి, ప్రయత్నించినా, పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది.


ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు శనివారం రాఖీ కట్టారు. మిఠాయిలు తినిపించారు. పలువురు తెలుగు మహిళలు కూడా ఎమ్మెల్యేకు సోదరభావంతో రాఖీలు కట్టి, ఆశీస్సులు తీసుకున్నారు.

జాలాదికి ఘన నివాళి


జాలాదికి నివాళి అర్పిస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాలాది విజయ తదితరులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 9 ఆంధ్రజ్యోతి : ప్రముఖ సినీ గేయ రచయిత జాలాది రాజారావు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జాలాది జయంతి సందర్భంగా ఆర్కే బీచ్ రోడ్డు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1932 ఆగస్టు 9న కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో జన్మించిన జాలాది బడి పంతులుగా తన జీవితాన్ని ప్రారంభించి రంగస్థలంపై కూడా 1970లో మద్రాస్ వెళ్లి ఘోస్ట్ రైటర్‌గా పని చేశారన్నారు. సుమారు 275 సినిమాలకు ఎన్నో పాటలను రాసి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో జాలాది శ్రీనివాసరావు, జాలాది కుమారి, జాలాది విజయ, జాలాది నిర్మల, జాలాది ఉమ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు


వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

సిరిపురం,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం సిరిపురంలోని శ్రీప్రసన్న పాండురంగ స్వామి దేవస్థానంలో శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు వేమకోటి శ్రీరామూర్తి పూజలను చేశారు. ఆలయ మేనేజర్ ఆడపా దేవుళ్ళు, ఉద్యోగులు మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 32, దొండకాయలు34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 22, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 82, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

ఘనంగా ఆదివాసీ దినోత్సవం


గిరిజన్ భవన్ వద్ద పతాకావిష్కరణలో పాల్గొన్న ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో శనివారం జెండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆగస్టు 15 వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులుసోనయి అప్పలరాజు, కటారి శోభన్‌కుమార్, రాము, శోభన్, ప్రసాద్, కర్రిదొర, తిలక్, సత్యారావు, రామునాయుడు, దాలిబాబు, రామలింగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంఖు చక్ర నామాల దీపాలు ప్రారంభోత్సవం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శంఖుచక్ర నామాల దీపాలను శనివారం రాత్రి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. సుమారు కోటి రూపాయల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన శంఖుచక్ర నామాలను ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుతో ఈ కూడలికి కొత్త కళ వచ్చింది.

కార్యక్రమంలో వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలరావు, తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, తెలుగుదేశం నాయకులు, జీవీఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు

సబ్బవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు అన్నారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మూడేళ్లు, ఐదేళ్లలా కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సం విద్యార్థులకు 'న్యాయ విద్య సమకాలీన పరిస్థితులు' అనే అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో మెలగుతూ.. లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. వ్యాట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ నేర్చుకోవడంలో నాలుగు దశలు ఉన్నాయని, ప్రతి దశలో నూ లక్ష్యాన్ని చేరుకున్నప్పుడే ఉన్నతి స్థితికి చేరుకోగల రన్నారు. వర్సిటీ వీసీ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రతి శనివారం ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జస్టిస్ లక్ష్మణరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

యుద్ధాలతో మిగిలేది విధ్వంసమే.. : ఇస్కాఫ్

సిరిపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : యుద్ధాల వల్ల మిగిలేది విధ్వంసమేనని, ప్రతీ ఒక్కరూ శాంతిమార్గంలోని పయనించాలని ఇస్కఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇస్కఫ్ ఆధ్వర్యంలో 'యుద్ధాలు వద్దు అని నినదిస్తూ శాంతి కోరుతూ పావురాలు ఎగారవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధాలతో మానవ వినాశనం సంభవిస్తుందన్నారు. ఆస్తులు ధ్వంసమై, ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి ప్రజలు తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ శాంతిమార్గంలోనే పయనించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.


కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సత్యాంజనేయ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, సభ్యులు జేవీ ప్రభాకర్, సత్యవతి, అప్పలరాజు, రాంప్రభు, మధుమతి, మధుబాబు, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాఖీ పండుగ

ఆరిలోవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పండుగ సందర్భంగా జీవీఎంసీ 10వ వార్డులో బీజేపీ మెడికల్ విభాగం కన్వీనర్ కేవీ వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్, బీజేపీ నేతలు శనివాం వివిధ దేవాలయాలకు వచ్చిన భక్తులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ సుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి రాఖీలను కట్టారు. కార్యక్రమంలో ఆరిలోవ ప్రచారక్ రొంగలి అప్పారావు, బీజేపీ మండల అధ్యక్షుడు దొంతల రమణ, జిలా కార్యవర్గ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, మండల అప్పారావు, బి. శ్రీనివాస్, సన్యాసినావు తదితరులు పాల్గొన్నారు.

బృందగాన పోటీలు

ఆరిలోవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజానాట్య మండలి ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో విజేత హైస్కూలులో 'దేశభక్తిని చాటుదాం' పేరుతో బృందగాన పోటీలను శనివారం నిర్వహించారు.ఈ పోటీలకు 8 స్కూళ్ల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చక్కని పాటలతో అలరించారు.



ఫోర్త్ టౌన్ సీఐగా ఉమాకాంత్ బాధ్యతల స్వీకారం



సీతంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా సీహెచ్ ఉమాకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణ బదిలీపై కోర్టు మానటరింగ్ సెల్ విభాగానికి వెళ్లారు. అక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమాకాంత్ ఇక్కడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. 2004వ బ్యాచ్‌కు చెందిన ఉమాకాంత్ గతంలో విశాఖ సిటీతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు చోట్ల విధులు నిర్వహించారు. సీఐడీలో కూడా విధులు నిర్వహించారు. 2013లో ఆయనకు పదోన్నతి లభించింది. శనివారం బాధ్యతలు చేపట్టిన సీఐకి స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. స్టేషన్ సిబ్బందిని పరిచయం చేసుకున్న ఉమాకాంత్ అన్ని విభాగాల్ని పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల సహకారంతో పాటుపడతానన్నారు.

ఏయూ ఇంటర్ నాన్ టీచింగ్ సిబ్బంది క్రీడా పోటీలు



విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ నాన్ టీచింగ్ సిబ్బంది క్రీడా పోటీలు శనివారం ఏయూ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందిలో స్నేహభావం, సేవాతత్వం పెంపొందించుకునేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. క్రికెట్ టోర్నీలో 13 జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. త్వరలో జరగనున్న వర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ క్రీడాకారులతోపాటు నాన్ టీచింగ్ సిబ్బంది కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు బి.రామచంద్ర, డి.శ్రీనివాసరావు, డి.గోవింద్, సాహు, కోన పోలారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చీరలు, మిఠాయిలు పంపిణీ

సీతంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సీతంపేట రాజేంద్రనగర్‌లో ఉన్న జనసేన పార్టీ నగర కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వీర మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి శివప్రసాద్ రెడ్డి, మహిళా కోఆర్డినేటర్ అమరాపు దుర్గ, వార్డు ఇన్‌చార్జిలు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, నారా నాగేశ్వరరావు, శ్రావణ్, గారికిన రవి, వెంకట్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

సీతమ్మధార, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. 375 మంది డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి స్టాఫ్ నర్సు, సిబ్బందిపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాటికి డ్రాప్ అవుట్స్ అన్నీ క్లియర్ అవ్వాలని ఆదేశించారు. ఈహెచ్‌ఆర్ కూడా సంతృప్తికరంగా లేదని, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని మెడికల్ అధికారిని ఆదేశించారు. అనంతరంర బ్లాక్ పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ పి.జగదీశ్వరరావు

వాల్తేరు రైల్వే హర్ ఘర్ తిరంగ ప్రచార ర్యాలీ

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని వాల్తేరు రైల్వే నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఆఫీసర్ హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష ఆధ్వర్యంలో తూర్పు కోస్తా రైల్వే క్రీడాకారులు, వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులు దేశ భక్తిని చాటే నినాదాలతో ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్ నుంచి బైక్ ర్యాలీ చేశారు. అలాగే సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషర్ అజయ్ ప్రకాష్ దుబే మార్గదర్శకంలో రైల్వే రక్షణ దళం జాతీయ జెండాతో రైల్వే కాలనీలలో హర్ ఘర్ తిరంగ బైక్ ర్యాలీ చేశారు. అనంతరం రైల్ క్లబ్‌లో ప్రదర్శించిన దేశభక్తి చిత్రాలను రైల్వే ఉద్యోగులకు, పిల్లలు వీక్షించారు. సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాలలో రైల్వే ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యమై జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తూ దేశభక్తిని చాటుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని సజీవంగా ఉంచేందుకు హర్ ఘర్ తరంగ ప్రచారం ప్రజల మనసులను కదిలిస్తుందని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తూర్పు కోస్తా రైల్వే క్రీడాకారులు

సహృదయంలో జీవనం సాగించాలి

సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఫ్రాన్సిస్



సంక్షిప్త రాజ్యాంగ ప్రతులను ప్రదర్శిస్తున్న సభ్యులు

కంచరపాలెం, ఆగస్టు 9 (ఆగస్టు) : ప్రతి ఒక్కరూ సహృదయంతో సమాజాభావృద్ధికి కృషి చేయాలని సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో సాహితీ స్రవంతి నెలవారీ సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న సభ్యులు, కవిత్వం, సాహిత్యప్రియులను ఉద్దేశించి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహృదయంతో ఇతరులకు సహాయం అందించాలన్నారు. నలుగురికి ఉపయోగపడేలా జీవనం సాగించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథి డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ... రచనా ప్రక్రియను చేపట్టిన ప్రతి ఒక్కరూ రాజ్యాంగం అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పద్యం, పాట, మాట, కవిత అన్న నాలుగు సాహితీ ప్రక్రియలపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో కె.సంతోషమ్మ, ఎం,ఆనంద్ శర్మ, డీఎస్‌కుమార్, వై.ఉమాశంకర్, కేవీ భాస్కర్, అడపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైశాఖీ పార్కులో పంద్రాగస్టు క్రీడా పోటీలు

మురళీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) ; భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఈ నెల 10న (ఆదివారం) స్విమ్మింగ్ పోటీలు జరపనున్నట్టు పార్కు కమిటీ అధ్యక్షుడు ఎస్. వరప్రసాద్ తెలిపారు. పార్కు ప్రక్కనే ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 8 గంటలకు పోటీలు ఆరంభమవుతాయన్నారు. అన్ని వయసుల వారీగా కేటగిరీలు విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. మహిళ, పురుషులకు వేర్వేరుగా పోటీలు చేపడతారు. సబ్ జూనియర్ 8 ఏళ్ల నుంచి 10 సంవత్సరాలు, జూనియర్స్ 10 నుంచి 13, 14 ఏళ్ల నుంచి 16 వరకు సీనియర్స్ ఆపైన 17 నుంచి 20 ఏళ్ల విభాగంలో సూపర్ సీనియర్స్ కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. 25 ఏళ్ల పైబడిన వారందరూ సూపర్ సీనియర్స్ కేటగిరీలో పోటీల్లో హాజరు కావచ్చని తెలిపారు. ఈ మేరకు స్విమ్మింగ్ పూల్ వద్ద పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సృష్టి అక్రమాలతో కేజీహెచ్‌కు సంబంధం లేదు

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి

మహారాణిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సృష్టి ఫెర్టిలిటీ సెంటరు అక్రమాలతో కేజీహెచ్ వైద్యులకు ఎటువంటి సంబంధం లేదని, ఒకవేళ ప్రమేయం ఉన్నట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తెలిపారు. ఇటీవల సృష్టి ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటరులో జరిగిన అక్రమాల్లో కేజీహెచ్‌కు చెందిన ఇద్దరు వైద్యుల పాత్ర ఉందని, వారిని హైదరాబాద్ పోలీసు అరెస్టు చేసినట్టు మీడియాలో వస్తున్న కథనాలపై వారు స్పందించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సృష్టి అక్రమాలతో ఏఎంసీ, కేజీహెచ్ వైద్యుల పాత్ర ఉందని, పత్రికల్లో కథనాలు రావడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటివరకు తమకు ఎటువంటి అధికారిక సమాచారం లేదని, సదరు వైద్యులు వారి వ్యక్తిగత హోదాలో ఈ పనులను నిర్వహించి ఉండవచ్చని చెప్పారు. ఈఘటనపై సదరు వైద్యులను ఫోన్ ద్వారా సంప్రతించి వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నించినా.. వారి ఫోన్లు పని చేయడం లేదన్నారు. పోలీసుల దర్యాప్తులో వైద్యుల పాత్ర ఉన్నట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



మహారాణిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ ఏరియాలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం లక్ష్మీ హోమం నిర్వహించారు. శ్రావణ మాసం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అమ్మవారికి తులసి దళార్చనతో పాటు హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఇసుక కొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పౌర్ణమి వ్రతాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం 200 మందితో వ్రతాలు నిర్వహించారు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, గణబాబు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

అక్కయ్యపాలెం/డాబాగార్డెన్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రాఖీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అన్నా తమ్ముళ్ళకు అక్కా చెల్లెళ్ళు రాఖీ కట్టి వారి ఆశీర్వాదం పొందారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని అసోసియేషన్ ఫర్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఏయూటీడీ) నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న పురుషులకు, అక్కడ ఉంటున్న మహిళలు రాఖీలు కట్టి సోదరీసోదరుల అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు లీలా, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో దేవకీనంద ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి బాపు ఆనంద్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలందరితో కలిసి రాఖీలు కట్టించుకుని సంతోషాన్ని పంచుకున్నారు.



సరళమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

డాబాగార్డెన్స్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సరళమైన పద్ధతిలో బోధనలు నిర్వహించాలని, తద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే విధానం అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనస్తత్వాన్ని ఎరిగి తద్వారా బోధన చేయగలిగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. పాఠశాలలకు పిల్లలను పంపించే విషయంలో తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం నిర్వాహకులు కేంద్ర ప్రభుత్వం డీఎల్ఈడీ ద్వారా ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా నాయకులు కృష్ణారెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, యు. సురేష్, జి. శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు, ఎం.రామునాయుడు, ఎం. వాణిశ్రీ, ఎం. శర్వాణీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మహారాణిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లోని వెల్డింగ్ షాపులో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఈమేరకు హోం మంత్రి వంగలపూడి అనిత వెల్డింగ్ షాప్ యజమాని చల్లా గణేశ్ భార్య సుధకు, ముత్యాల నాయుడు భార్య ప్రమీలాకు, శ్రీనివాస్ భార్య లక్ష్మికి వారి నివాసాలకు వెళ్లి శనివారం చెక్కులు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులు ఎల్లాజీ రంగారావు, సన్యాసి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. వెల్డింగ్ షాపు సమీపంలో ఉన్న దుకాణదారులకు కూడా ప్రమాద సమయంలో స్వల్ప గాయాలయ్యాయని, వారికి కూడా వైద్యం అందించాలని సూచించారు. ఫోరెన్సిక్ నిపుణుల దర్యాప్తు జరుగుతుందని, పేలుడుకు గల కారణాలపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని చెప్పారు. సముద్రంలో దొరికిన వస్తువులను భద్రపరచడం,వాటి సమాచారం అధికారులకు అందించడంపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, పాల్గొన్నారు.



మృతుడి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న హోం మంత్రి అనిత, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు, సిబ్బంది

సందడిగా వీఎంఆర్‌డీఏ క్రీడా ఉత్సవం

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో శనివారం క్రీడా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో పాటు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, క్రెడాయ్ పూర్వ చైర్మన్ ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా పల్లా శ్రీనివాసరావు బౌలింగ్ చేయగా, వెలగపూడి, గణబాబు బ్యాటింగ్ చేశారు. అలాగే వీఎంఆర్డీఏ చైర్మన్, కమిషనర్ ఒకవైపు, ప్రజాప్రతినిధులు మరోవైపు ఉండి 'టగ్ ఆఫ్ వార్' ఆడగా వీఎంఆర్‌డీఏ గ్రూప్ గెలిచింది. ఇలాంటి క్రీడల వల్ల ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధి కాశీవిశ్వనాథం, సీఏవో హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో దొరికిన వస్తువును

కట్ చేస్తుండగా పేలుడు?

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో దొరికిన వస్తువును కట్ చేసే క్రమంలోనే హార్బర్ సమీపంలో పేలుడు సంభవించిందని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. గురువారం సాయంత్రం వెల్డింగ్ దుకాణంలో జరిగిన పేలుడులో ముగ్గురు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడే కారణమని మొదట్లో అందరూ భావించారు. కానీ పోలీసులు, ఫోరెన్సిక్ బృందం గ్యాస్ సిలిండర్ కారణంగా పేలుడు జరగలేదని నిర్ధారించినట్టు సమాచారం. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి ఏదో ఒక వస్తువు దొరకగా, దానిని వారు స్క్రాప్ దుకాణంలో విక్రయించారు. దానిని కట్ చేయాలంటూ స్క్రాప్ దుకాణం యజమాని పక్కనే ఉన్న వెల్డింగ్‌షాపు యజమాని గణేష్‌కు ఇచ్చారు. దానిని కట్టర్‌తో కట్ చేస్తుండగా పేలుడు జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక వచ్చేంత వరకు స్పష్టమైన అంచనాకు రాలేమని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సన్యాసిరావును మెరుగైన వైద్యం నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

క్రాస్‌ఓటింగ్‌పై జనసేన పోస్టుమార్టం

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్ ఒకరు...ఏడు ఓట్లు కూటమి అభ్యర్థులకు కాకుండా వైసీపీ నుంచి పోటీ చేసిన వారికి వేసినట్టు స్పష్టమైందన్నారు. అలాగే మరో ఆరుగురు కూడా వైసీపీ అభ్యర్థులకు ఓటు వేసినట్టు గుర్తించామన్నారు.దీనిపై అధిష్టానానికి నివేదిక పంపిస్తామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలమేరకు వారిపై చర్యలు ఉంటాయన్నారు.

ఉక్కు యాజమాన్యం దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

ఒక్కో విభాగం ఒక్కొక్కరికి...

ఏదైనా బస్సును నడుపుతున్నప్పుడు స్టీరింగ్ ఒకరు పట్టుకొని, గేర్లు ఒకరు మారుస్తూ, బ్రేకులు ఇంకొకరు వేస్తుంటే... ఆ బస్సు ఎలా నడుస్తుందో...ఇప్పుడు స్టీల్ ప్లాంటు పరిస్థితి కూడా అలాగే ఉందని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఒక్కో విభాగాన్ని ఒక్కొక్కరికి అప్పగిస్తూ సమన్వయం లేకుండా చేస్తున్నారని, ఇది పూర్తిగా స్టీల్ ప్లాంటును నిర్వీర్యం చేస్తుందని ఉద్యోగులు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

బదిలీ టీచర్లకు అందని జీతాలు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలకు పంపించారు. దీనికి ఆర్థిక శాఖ నుంచి ముందుగా అనుమతి తీసుకోలేదు. అందువల్లే బదిలీపై నియమించిన టీచర్లకు జీతాలు బట్వాడాలో సమస్య ఉత్పన్నమైంది. జూన్ మూడో వారంలో ఈ సమస్య గుర్తించినా ఉన్నతస్థాయి నుంచి ఆదేశాల జారీకి తీవ్ర జాప్యం ఏర్పడింది. దీంతో ఆ నెల బిల్లులు అప్‌లోడ్ కాలేదు. సాధారణంగా నిర్దీత గడువులోగా అప్‌లోడ్ చేయని బిల్లులు మరునటి నెల అంటే జూలై ఆరు నుంచి పదో తేదీలోగా అప్‌లోడ్ చేయాలి. అయితే జీతం బిల్లు అప్‌లోడ్ చేయాలంటే ప్రతి టీచర్‌కు పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంది. గత నెలలో ఆ పని చేయలేదు. నెలాఖరున అప్‌లోడ్‌కు పొజిషన్ ఐడీ సమస్య వచ్చింది. దీంతో జూలై నెల జీతం రాలేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 1,200 మంది టీచర్లు రెండు నెలల నుంచి జీతాలకు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జీతాల విడుదలకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ కోరారు.

గిరిజన సాధికారతకు కట్టుబడి ఉన్నా

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి రెండు కోట్లు కావాలని అడిగారని, వాటిని ఇస్తానని హామీ ఇచ్చారు. పాడేరు రావడం తన అదృష్టంగా సీఎం పేర్కొన్నారు. ఏజెన్సీ అందాలు తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఇక్కడికి వస్తే ఆనందంతో పాటు ధైర్యం కూడా వస్తుందన్నారు. ఇక్కడి ప్రజలు కూడా మంచివారని, వారి మనసుల్లో ఎటువంటి కలుషితం లేదన్నారు. సంపద అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. పాడేరు దిశ, దశ మారేలా తాను అభివృద్ధి చేస్తానన్నారు. పాడేరులో మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తానన్నారు. ఏజెన్సీకి రావడానికి డాక్టర్లు ఆసక్తి చూపడం లేదని, వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చి రప్పిస్తామన్నారు. దీపం పథకం ఈ ప్రాంత ప్రజలకు అందలేదని ఆలస్యంగా తెలిసిందని, ఈ నెలలోనే అందరికీ ఉచితంగా గ్యాస్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏజెన్సీలో ఆరు లక్షల ఎకరాల్లో వెదురు ఉందని, అది డ్వాక్రా గ్రూపులకు ఉపయోగపడేలా ప్రాజెక్టుకు ఎంఓయూ చేశామని, దీని వల్ల ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఒక్కొక్కరికి ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం వస్తుందన్నారు.

చిన్న వయసులోనే దృష్టిలోపం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసినట్టు ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ మీనాక్షి తెలిపారు. ఒక్కో బృందంలో పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆశ వర్కర్, ఏఎన్ఎం ఉంటారు. వీరంతా వారికి కేటాయించిన షెడ్యూల్ మేరకు స్కూల్స్‌కు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు.

కారణాలు

చిన్నారులు కంటి సమస్యలతో బాధపడు తుండడానికి అనేక అంశాలు దోహదం చేస్తు న్నట్టు చెబుతున్నారు. ఇందులో ప్రధాన కారణం చిన్న వయసు నుంచే గంటల తరబడి ఫోన్ వినియోగించడంగా చెబుతున్నారు. అలాగే పోషకాహార లోపం, గర్భిణీగాఉన్న సమయంలో తల్లి పోషకాహారాన్ని తీసుకోకపోవడం, తల్లి దండ్రుల్లో ఎవరో ఒకరు కళ్లద్దాలు విని యోగించడం, తీవ్రమైన ఒత్తిడి, విటమిన్లు సమస్య, ఒంటరితనం, చదువులో వెనుకబాటు, వెలుతురు సరిగా లేని చిన్నపాటి గదుల్లో తరగతులు నిర్వహించడం వంటి అంశాలు కారణమవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

తప్పనిసరిగా పరీక్షలు చేయించాలి

- డాక్టర్ మీనాక్షి, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రామ్ అధికారి

గతంతో పోలిస్తే చిన్నారుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న వయసులోనే టీవీలకు అలవాటు పడడం ప్రధాన కారణంగా ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. చదువుతున్నప్పుడు, రాస్తు న్నప్పుడు పిల్లలు కంటిపై ఒత్తిడి పడుతున్నట్టు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. పిల్లలకు కంటి ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలను రోజువారీ ఆహారంలో ఉండేలా చూడాలి. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. దీనివల్ల సమస్యను వేగంగా గుర్తించేందుకు అవకాశం ఉంది.

దర్జాగా గ్రీన్‌బెల్ట్ కబ్జా

... 5వ పేజీ తరువాయి

అనుకునే సరుగుడు కర్రల విక్రయ కేంద్రం ఏర్పాటుచేశారు. వాటికి ఎదురుగా జాతీయ రహదారికి మరోవైపు జీవీఎంసీ పేరుతో ఒకరు వాహనాల రిపేరు చేసే మెకానిక్ షెడ్‌ను ఏర్పాటుచేసి గ్యారేజీగా మార్చేశారు. హనుమంతవాక జంక్షన్ సమీపంలో ఒకరు నర్సరీని గ్రీన్ బెల్ట్‌లోనే ఏర్పాటుచేశారు. వెంకోజీపాలెం జంక్షన్ వద్ద పాత ఇంటి సామగ్రి విక్రయించే దుకాణాలు, సరుగుడు దుకాణాలు, కార్పెంటర్ల దుకాణాలు వెలిశాయి. ఇసుకతోట జంక్షన్ సమీపంలో గ్రీన్‌బెల్ట్‌ను పూర్తిగా తొలగించేసి కార్ డెకార్స్, మెకానిక్ షెడ్‌లు, మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ సమీపంలో ఏకంగా ఫ్రీ వెండింగ్‌జోన్ పేరుతో ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, గురుద్వార శ్మశానవాటిక పక్కన కారు, ఏసీ రిపేర్లు చేసే మెకానిక్ గ్యారేజీ ఏర్పాటుచేసేశారు. మర్రిపాలెం పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో ఎండుగడ్డిపైకప్పుతో ఒక షెడ్ నిర్మించేసి అందులో ఆవులు పెంపకం చేస్తున్నారు.

గ్రీన్‌బెల్ట్ ఆక్రమణకు గురవుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులుగానీ, ఇంజనీరింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎవరైనా గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళితే ఆ విషయం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చూసుకోవాలని, వారు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కూడా కళ్లముందు ఆక్రమణలు కనిపిస్తున్నా జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదుచేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా అధికారులు గ్రీన్‌బెల్ట్ ఆక్రమణపై జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో గ్రీన్‌బెల్ట్ పూర్తిగా కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు.

రాఖీ సందడి... రోడ్లన్నీ రద్దీ

అడుగడుగునా ట్రాఫిక్ జామ్..


వెంకోజీపాలెం సిగ్నల్స్ వద్ద రోడ్డు మధ్యలో నిలిచిపోయిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పండుగ సందర్భంగా శనివారం రహదారులు కిక్కిరిశాయి. ఓ పక్క వారాంతం, మూడు రోజుల వరుస సెలవులు, రక్షాబంధన్‌లో భాగంగా అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు, సోదరీమణులకు బహుమతులు అందజేసేందుకు అన్నదమ్ముల షాపింగ్‌లు.. ఇలా ఎవరి బిజీలో వారు రాకపోకలు సాగించడంతో అన్ని ప్రాంతాలు రద్దీగా కనిపించాయి. చిన్నా పెద్దా లేకుండా రాఖీ పండుగ జరుపుకోవడానికి అంతా ఉత్సాహం చూపారు. పలు ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఏర్పడింది. రహదారులు కిక్కిరిశాయి. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రహదారులపై మరింతగా సందడి కనిపించింది.

ఇసుకతోట ఐసీఐసీఐ కూడలి నుంచి డెయిరీ ఫారం ఆదర్శనగర్ జంక్షన్ వరకూ కూడళ్లలో వాహనాలు బారులు తీరాయి. ఒక కిలోమీటరు దూరం ప్రయాణించడానికి కనీసం అరగంట పట్టింది. ఓ పరిస్థితిలో హనుమంతువాక నుంచి వెంకోజీపాలెం వరకూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎంవీపీ వైపు నుంచి జాతీయ రహదారి పైకి వచ్చిన వాహనాలు రోడ్డు మధ్యలోనే ఆగిపోవాల్సి వచ్చింది. శనివారం రాత్రి తొమ్మిదిన్నర వరకూ పరిస్థితి ఇలాగే కొనసాగింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి సిగ్నల్ లైట్లు ఆపేసి, ప్రయత్నించినా, పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది.


ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు శనివారం రాఖీ కట్టారు. మిఠాయిలు తినిపించారు. పలువురు తెలుగు మహిళలు కూడా ఎమ్మెల్యేకు సోదరభావంతో రాఖీలు కట్టి, ఆశీస్సులు తీసుకున్నారు.

జాలాదికి ఘన నివాళి


జాలాదికి నివాళి అర్పిస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాలాది విజయ తదితరులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 9 ఆంధ్రజ్యోతి : ప్రముఖ సినీ గేయ రచయిత జాలాది రాజారావు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జాలాది జయంతి సందర్భంగా ఆర్కే బీచ్ రోడ్డు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1932 ఆగస్టు 9న కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో జన్మించిన జాలాది బడి పంతులుగా తన జీవితాన్ని ప్రారంభించి రంగస్థలంపై కూడా 1970లో మద్రాస్ వెళ్లి ఘోస్ట్ రైటర్‌గా పని చేశారన్నారు. సుమారు 275 సినిమాలకు ఎన్నో పాటలను రాసి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో జాలాది శ్రీనివాసరావు, జాలాది కుమారి, జాలాది విజయ, జాలాది నిర్మల, జాలాది ఉమ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు


వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

సిరిపురం,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం సిరిపురంలోని శ్రీప్రసన్న పాండురంగ స్వామి దేవస్థానంలో శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు వేమకోటి శ్రీరామూర్తి పూజలను చేశారు. ఆలయ మేనేజర్ ఆడపా దేవుళ్ళు, ఉద్యోగులు మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 32, దొండకాయలు34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 22, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 82, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

ఘనంగా ఆదివాసీ దినోత్సవం


గిరిజన్ భవన్ వద్ద పతాకావిష్కరణలో పాల్గొన్న ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో శనివారం జెండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆగస్టు 15 వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులుసోనయి అప్పలరాజు, కటారి శోభన్‌కుమార్, రాము, శోభన్, ప్రసాద్, కర్రిదొర, తిలక్, సత్యారావు, రామునాయుడు, దాలిబాబు, రామలింగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంఖు చక్ర నామాల దీపాలు ప్రారంభోత్సవం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శంఖుచక్ర నామాల దీపాలను శనివారం రాత్రి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. సుమారు కోటి రూపాయల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన శంఖుచక్ర నామాలను ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుతో ఈ కూడలికి కొత్త కళ వచ్చింది.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

కార్యక్రమంలో వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలరావు, తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, తెలుగుదేశం నాయకులు, జీవీఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు

సబ్బవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు అన్నారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మూడేళ్లు, ఐదేళ్లలా కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సం విద్యార్థులకు 'న్యాయ విద్య సమకాలీన పరిస్థితులు' అనే అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో మెలగుతూ.. లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. వ్యాట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ నేర్చుకోవడంలో నాలుగు దశలు ఉన్నాయని, ప్రతి దశలో నూ లక్ష్యాన్ని చేరుకున్నప్పుడే ఉన్నతి స్థితికి చేరుకోగల రన్నారు. వర్సిటీ వీసీ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రతి శనివారం ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జస్టిస్ లక్ష్మణరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

యుద్ధాలతో మిగిలేది విధ్వంసమే.. : ఇస్కఫ్

సిరిపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : యుద్ధాల వల్ల మిగిలేది విధ్వంసమేనని, ప్రతీ ఒక్కరూ శాంతిమార్గంలోని పయనించాలని ఇస్కఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇస్కఫ్ ఆధ్వర్యంలో 'యుద్ధాలు వద్దు అని నినదిస్తూ శాంతి కోరుతూ పావురాలు ఎగారవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధాలతో మానవ వినాశనం సంభవిస్తుందన్నారు. ఆస్తులు ధ్వంసమై, ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి ప్రజలు తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ శాంతిమార్గంలోనే పయనించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సత్యాంజనేయ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, సభ్యులు జేవీ ప్రభాకర్, సత్యవతి, అప్పలరాజు, రాంప్రభు, మధుమతి, మధుబాబు, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాఖీ పండుగ

ఆరిలోవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పండుగ సందర్భంగా జీవీఎంసీ 10వ వార్డులో బీజేపీ మెడికల్ విభాగం కన్వీనర్ కేవీ వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్, బీజేపీ నేతలు శనివారం వివిధ దేవాలయాలకు వచ్చిన భక్తులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ సుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి రాఖీలను కట్టారు. కార్యక్రమంలో ఆరిలోవ ప్రచారక్ రొంగలి అప్పారావు, బీజేపీ మండల అధ్యక్షుడు దొంతల రమణ, జిలా కార్యవర్గ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, మండల అప్పారావు, బి. శ్రీనివాస్, సన్యాసినావు తదితరులు పాల్గొన్నారు.

బృందగాన పోటీలు

ఆరిలోవ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజానాట్య మండలి ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో విజేత హైస్కూలులో 'దేశభక్తిని చాటుదాం' పేరుతో బృందగాన పోటీలను శనివారం నిర్వహించారు.ఈ పోటీలకు 8 స్కూళ్ల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చక్కని పాటలతో అలరించారు.

ఫోర్త్ టౌన్ సీఐగా ఉమాకాంత్ బాధ్యతల స్వీకారం



సీతంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా సీహెచ్ ఉమాకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణ బదిలీపై కోర్టు మానటరింగ్ సెల్ విభాగానికి వెళ్లారు. అక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమాకాంత్ ఇక్కడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. 2004వ బ్యాచ్‌కు చెందిన ఉమాకాంత్ గతంలో విశాఖ సిటీతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు చోట్ల విధులు నిర్వహించారు. సీఐడీలో కూడా విధులు నిర్వహించారు. 2013లో ఆయనకు పదోన్నతి లభించింది. శనివారం బాధ్యతలు చేపట్టిన సీఐకి స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. స్టేషన్ సిబ్బందిని పరిచయం చేసుకున్న ఉమాకాంత్ అన్ని విభాగాల్ని పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల సహకారంతో పాటుపడతానన్నారు.

ఏయూ ఇంటర్ నాన్ టీచింగ్ సిబ్బంది క్రీడా పోటీలు



విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ నాన్ టీచింగ్ సిబ్బంది క్రీడా పోటీలు శనివారం ఏయూ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందిలో స్నేహభావం, సేవాతత్వం పెంపొందించుకునేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. క్రికెట్ టోర్నీలో 13 జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. త్వరలో జరగనున్న వర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ క్రీడాకారులతోపాటు నాన్ టీచింగ్ సిబ్బంది కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు బి.రామచంద్ర, డి.శ్రీనివాసరావు, డి.గోవింద్, సాహు, కోన పోలారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చీరలు, మిఠాయిలు పంపిణీ

సీతంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సీతంపేట రాజేంద్రనగర్‌లో ఉన్న జనసేన పార్టీ నగర కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వీర మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి శివప్రసాద్ రెడ్డి, మహిళా కోఆర్డినేటర్ అమరాపు దుర్గ, వార్డు ఇన్‌చార్జిలు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, నారా నాగేశ్వరరావు, శ్రావణ్, గారికిన రవి, వెంకట్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

సీతమ్మధార, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. 375 మంది డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి స్టాఫ్ నర్సు, సిబ్బందిపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాటికి డ్రాప్ అవుట్స్ అన్నీ క్లియర్ అవ్వాలని ఆదేశించారు. ఈహెచ్‌ఆర్ కూడా సంతృప్తికరంగా లేదని, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని మెడికల్ అధికారిని ఆదేశించారు. అనంతరంర బ్లాక్ పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ పి.జగదీశ్వరరావు

వాల్తేరు రైల్వే హర్ ఘర్ తిరంగ ప్రచార ర్యాలీ

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని వాల్తేరు రైల్వే నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ ఆఫీసర్ హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష ఆధ్వర్యంలో తూర్పు కోస్తా రైల్వే క్రీడాకారులు, వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులు దేశ భక్తిని చాటే నినాదాలతో ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ నుంచి బైక్ ర్యాలీ చేశారు. అలాగే సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్ ప్రకాష్ దుబే మార్గదర్శకంలో రైల్వే రక్షణ దళం జాతీయ జెండాతో రైల్వే కాలనీలలో హర్ ఘర్ తిరంగ బైక్ ర్యాలీ చేశారు. అనంతరం రైల్ క్లబ్‌లో ప్రదర్శించిన దేశభక్తి చిత్రాలను రైల్వే ఉద్యోగులకు, పిల్లలు వీక్షించారు. సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాలలో రైల్వే ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యమై జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తూ దేశభక్తిని చాటుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని సజీవంగా ఉంచేందుకు హర్ ఘర్ తరంగ ప్రచారం ప్రజల మనసులను కదిలిస్తుందని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తూర్పు కోస్తా రైల్వే క్రీడాకారులు

సహృదయంలో జీవనం సాగించాలి

▸▸ సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఫ్రాన్సిస్



సంక్షిప్త రాజ్యాంగ ప్రతులను ప్రదర్శిస్తున్న సభ్యులు

కంచరపాలెం, ఆగస్టు 9 (ఆగస్టు) : ప్రతి ఒక్కరూ సహృదయంతో సమాజాభావృద్ధికి కృషి చేయాలని సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. కంచరపాలెం బీఎస్‌ఆర్ భవనంలో సాహితీ స్రవంతి నెలవారీ సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న సభ్యులు, కవిత్వం, సాహిత్యప్రియులను ఉద్దేశించి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహృదయంతో ఇతరులకు సహాయం అందించాలన్నారు. నలుగురికి ఉపయోగపడేలా జీవనం సాగించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథి డాక్టర్ కేవీ రమణ మాట్లాడతూ... రచనా ప్రక్రియను చేపట్టిన ప్రతి ఒక్కరూ రాజ్యాంగం అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పద్యం, పాట, మాట, కవిత అన్న నాలుగు సాహితీ ప్రక్రియలపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో కె.సంతోషమ్మ, ఎం,ఆనంద్ శర్మ, డీఎస్‌కుమార్, వై.ఉమాశంకర్, కేవీ భాష్కర్, అడపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైశాఖీ పార్కులో పంద్రాగస్టు క్రీడా పోటీలు

మురళీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) ; భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో ఈ నెల 10న (ఆదివారం) స్విమ్మింగ్ పోటీలు జరపనున్నట్టు పార్కు కమిటీ అధ్యక్షుడు ఎస్. వరప్రసాద్ తెలిపారు. పార్కు ప్రక్కనే ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 8 గంటలకు పోటీలు ఆరంభమవుతాయన్నారు. అన్ని వయసుల వారీగా కేటగిరీలు విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. మహిళ, పురుషులకు వేర్వేరుగా పోటీలు చేపడతారు. సబ్ జూనియర్ 8 ఏళ్ల నుంచి 10 సంవత్సరాలు, జూనియర్స్ 10 నుంచి 13, 14 ఏళ్ల నుంచి 16 వరకు సీనియర్స్ ఆపైన 17 నుంచి 20 ఏళ్ల విభాగంలో సూపర్ సీనియర్స్ కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. 25 ఏళ్ల పైబడిన వారందరూ సూపర్ సీనియర్స్ కేటగిరీలో పోటీల్లో హాజరు కావచ్చని తెలిపారు. ఈ మేరకు స్విమ్మింగ్ పూల్ వద్ద పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సముద్రంలో దొరికిన వస్తువును కట్ చేస్తుండగా పేలుడు?

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో దొరికిన వస్తువును కట్ చేసే క్రమంలోనే హార్బర్ సమీపంలో పేలుడు సంభవించిందని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. గురువారం సాయంత్రం వెల్డింగ్ దుకాణంలో జరిగిన పేలుడులో ముగ్గురు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడే కారణమని మొదట్లో అందరూ భావించారు. కానీ పోలీసులు, ఫోరెన్సిక్ బృందం గ్యాస్ సిలిండర్ కారణంగా పేలుడు జరగలేదని నిర్ధారించినట్టు సమాచారం. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి ఏదో ఒక వస్తువు దొరకగా, దానిని వారు స్క్రాప్ దుకాణంలో విక్రయించారు. దానిని కట్ చేయాలంటూ స్క్రాప్ దుకాణం యజమాని పక్కనే ఉన్న వెల్డింగ్‌షాపు యజమాని గణేష్‌కు ఇచ్చారు. దానిని కట్టర్‌తో కట్ చేస్తుండగా పేలుడు జరిగి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక వచ్చేంత వరకు స్పష్టమైన అంచనాకు రాలేమని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సన్యాసిరావును మెరుగైన వైద్యం నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

క్రాస్‌ఓటింగ్‌పై జనసేన పోస్టుమార్టం

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్ ఒకరు...ఏడు ఓట్లు కూటమి అభ్యర్థులకు కాకుండా వైసీపీ నుంచి పోటీ చేసిన వారికి వేసినట్టు స్పష్టమైందన్నారు. అలాగే మరో ఆరుగురు కూడా వైసీపీ అభ్యర్థులకు ఓటు వేసినట్టు గుర్తించామన్నారు.దీనిపై అధిష్ఠానానికి నివేదిక పంపిస్తామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలమేరకు వారిపై చర్యలు ఉంటాయన్నారు.

ఉక్కు యాజమాన్యం దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

ఒక్కో విభాగం ఒక్కొక్కరికి...

ఏదైనా బస్సును నడుపుతున్నప్పుడు స్టీరింగ్ ఒకరు పట్టుకొని, గేర్లు ఒకరు మారుస్తూ, బ్రేకులు ఇంకొకరు వేస్తుంటే... ఆ బస్సు ఎలా నడుస్తుందో...ఇప్పుడు స్టీల్ ప్లాంటు పరిస్థితి కూడా అలాగే ఉందని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఒక్కో విభాగాన్ని ఒక్కొక్కరికి అప్పగిస్తూ సమన్వయం లేకుండా చేస్తున్నారని, ఇది పూర్తిగా స్టీల్ ప్లాంటును నిర్వీర్యం చేస్తుందని ఉద్యోగులు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

బదిలీ టీచర్లకు అందని జీతాలు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలకు పంపించారు. దీనికి ఆర్థిక శాఖ నుంచి ముందుగా అనుమతి తీసుకోలేదు. అందువల్లే బదిలీపై నియమించిన టీచర్లకు జీతాలు బట్వాడాలో సమస్య ఉత్పన్నమైంది. జూన్ మూడో వారంలో ఈ సమస్య గుర్తించినా ఉన్నతస్థాయి నుంచి ఆదేశాల జారీకి తీవ్ర జాప్యం ఏర్పడింది. దీంతో ఆ నెల బిల్లులు అప్‌లోడ్ కాలేదు. సాధారణంగా నిర్ణీత గడువులోగా అప్‌లోడ్ చేయని బిల్లులు మరుసటి నెల అంటే జూలై ఆరు నుంచి పదో తేదీలోగా అప్‌లోడ్ చేయాలి. అయితే జీతం బిల్లు అప్‌లోడ్ చేయాలంటే ప్రతి టీచర్‌కు పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంది. గత నెలలో ఆ పని చేయలేదు. నెలాఖరున అప్‌లోడ్‌కు పొజిషన్ ఐడీ సమస్య వచ్చింది. దీంతో జూలై నెల జీతం రాలేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 1,200 మంది టీచర్లు రెండు నెలల నుంచి జీతాలకు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జీతాల విడుదలకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ కోరారు.

గిరిజన సాధికారతకు కట్టుబడి ఉన్నా

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి రెండు కోట్లు కావాలని అడిగారని, వాటిని ఇస్తానని హామీ ఇచ్చారు. పాడేరు రావడం తన అదృష్టంగా సీఎం పేర్కొన్నారు. ఏజెన్సీ అందాలు తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఇక్కడికి వస్తే ఆనందంతో పాటు ధైర్యం కూడా వస్తుందన్నారు. ఇక్కడి ప్రజలు కూడా మంచివారని, వారి మనసుల్లో ఎటువంటి కలుషితం లేదన్నారు. సంపద అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. పాడేరు దిశ, దశ మారేలా తాను అభివృద్ధి చేస్తానన్నారు. పాడేరులో మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తానన్నారు. ఏజెన్సీకి రావడానికి డాక్టర్లు ఆసక్తి చూపడం లేదని, వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చి రప్పిస్తామన్నారు. దీపం పథకం ఈ ప్రాంత ప్రజలకు అందలేదని ఆలస్యంగా తెలిసిందని, ఈ నెలలోనే అందరికీ ఉచితంగా గ్యాస్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏజెన్సీలో ఆరు లక్షల ఎకరాల్లో వెదురు ఉందని, అది డ్వాక్రా గ్రూపులకు ఉపయోగపడేలా ప్రాజెక్టుకు ఎంఓయూ చేశామని, దీని వల్ల ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఒక్కొక్కరికి ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం వస్తుందన్నారు.

చిన్న వయసులోనే దృష్టిలోపం

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసినట్లు ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ మీనాక్షి తెలిపారు. ఒక్కో బృందంలో పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆశ వర్కర్, ఏఎన్ఎం ఉంటారు. వీరంతా వారికి కేటాయించిన షెడ్యూల్ మేరకు స్కూల్స్‌కు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు.

కారణాలు

చిన్నారులు కంటి సమస్యలతో బాధపడు తుండడానికి అనేక అంశాలు దోహదం చేస్తు న్నట్టు చెబుతున్నారు. ఇందులో ప్రధాన కారణం చిన్న వయసు నుంచే గంటల తరబడి ఫోన్ వినియోగించడంగా చెబుతున్నారు. అలాగే పోషకాహార లోపం, గర్భిణిగా ఉన్న సమయంలో తల్లి పోషకాహారాన్ని తీసుకోకపోవడం, తల్లి దండ్రుల్లో ఎవరో ఒకరు కళ్లద్దాలు విని యోగించడం, తీవ్రమైన ఒత్తిడి, విటమిన్లు సమస్య, ఒంటరితనం, చదువులో వెనుకబాటు, వెలుతురు సరిగా లేని చిన్నపాటి గదుల్లో తరగతులు నిర్వహించడం వంటి అంశాలు కారణమవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

తప్పనిసరిగా పరీక్షలు చేయించాలి

- డాక్టర్ మీనాక్షి, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రామ్ అధికారి

గతంతో పోలిస్తే చిన్నారుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న వయసులోనే టీవీలకు అలవాటు పడడం ప్రధాన కారణంగా ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. చదువుతున్నప్పుడు, రాస్తు న్నప్పుడు పిల్లలు కంటిపై ఒత్తిడి పడుతున్నట్టు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. పిల్లలకు కంటి ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలను రోజువారీ ఆహారంలో ఉండేలా చూడాలి. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. దీనివల్ల సమస్యను వేగంగా గుర్తించేందుకు అవకాశం ఉంది.

సృష్టి అక్రమాలతో కేజీహెచ్‌కు సంబంధం లేదు

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి

మహారాణిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సృష్టి ఫెర్టిలిటీ సెంటరు అక్రమాలతో కేజీహెచ్ వైద్యులకు ఎటువంటి సంబంధం లేదని, ఒకవేళ ప్రమేయం ఉన్నట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తెలిపారు. ఇటీవల సృష్టి ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటరులో జరిగిన అక్రమాల్లో కేజీహెచ్‌కు చెందిన ఇద్దరు వైద్యుల పాత్ర ఉందని, వారిని హైదరాబాద్ పోలీసు అరెస్టు చేసినట్టు మీడియాలో వస్తున్న కథనాలపై వారు స్పందించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సృష్టి అక్రమాలతో ఏఎంసీ, కేజీహెచ్ వైద్యుల పాత్ర ఉందని, పత్రికల్లో కథనాలు రావడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటివరకు తమకు ఎటువంటి అధికారిక సమాచారం లేదని, సదరు వైద్యులు వారి వ్యక్తిగత హోదాలో ఈ పనులను నిర్వహించి ఉండవచ్చని చెప్పారు. ఈఘటనపై సదరు వైద్యులను ఫోన్ ద్వారా సంప్రతించి వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నించినా.. వారి ఫోన్లు పని చేయడం లేదన్నారు. పోలీసుల దర్యాప్తులో వైద్యుల పాత్ర ఉన్నట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



మహారాణిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ ఏరియాలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం లక్ష్మీ హోమం నిర్వహించారు. శ్రావణ మాసం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అమ్మవారికి తులసి దళార్చనతో పాటు హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఇసుక కొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పౌర్ణమి వ్రతాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం 200 మందితో వ్రతాలు నిర్వహించారు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, గణబాబు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

అక్కయ్యపాలెం/డాబాగార్డెన్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రాఖీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అన్నా తమ్ముళ్ళకు అక్కా చెల్లెళ్ళు రాఖీ కట్టి వారి ఆశీర్వాదం పొందారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని అసోసియేషన్ ఫర్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఏయూటీడీ) నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న పురుషులకు, అక్కడ ఉంటున్న మహిళలు రాఖీలు కట్టి సోదరీసోదరుల అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు లీలా, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో దేవకీనంద ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి బాపు ఆనంద్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలందరితో కలిసి రాఖీలు కట్టించుకుని సంతోషాన్ని పంచుకున్నారు.



సరళమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

డాబాగార్డెన్స్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సరళమైన పద్ధతిలో బోధనలు నిర్వహించాలని, తద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అనెడెడ్ స్కూల్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే విధానం అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనస్తత్వాన్ని ఎరిగి తద్వారా బోధన చేయగలిగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. పాఠశాలలకు పిల్లలను పంపించే విషయంలో తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం నిర్వాహకులు కేంద్ర ప్రభుత్వం డీఎల్‌ఈడీ ద్వారా ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా నాయకులు కృష్ణారెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, యు. సురేష్, జి. శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు, ఎం.రామునాయుడు, ఎం. వాణిశ్రీ, ఎం. శర్వాణీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మహారాణిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లోని వెల్డింగ్ షాపులో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఈమేరకు హోం మంత్రి వంగలపూడి అనిత వెల్డింగ్ షాప్ యజమాని చల్లా గణేశ్ భార్య సుధకు, ముత్యాల నాయుడు భార్య ప్రమీలాకు, శ్రీనివాస్ భార్య లక్ష్మికి వారి నివాసాలకు వెళ్లి శనివారం చెక్కులు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులు ఎల్లాజీ రంగారావు, సన్యాసి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. వెల్డింగ్ షాపు సమీపంలో ఉన్న దుకాణదారులకు కూడా ప్రమాద సమయంలో స్వల్ప గాయాలయ్యాయని, వారికి కూడా వైద్యం అందించాలని సూచించారు. ఫోరెన్సిక్ నిపుణుల దర్యాప్తు జరుగుతుందని, పేలుడుకు గల కారణాలపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని చెప్పారు. సముద్రంలో దొరికిన వస్తువులను భద్రపరచడం,వాటి సమాచారం అధికారులకు అందించడంపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, పాల్గొన్నారు.



మృతుడి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న హోం మంత్రి అనిత, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు, సిబ్బంది

సందడిగా వీఎంఆర్‌డీఏ క్రీడా ఉత్సవం

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో శనివారం క్రీడా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో పాటు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, క్రెడాయ్ పూర్వ చైర్మన్ ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా పల్లా శ్రీనివాసరావు బౌలింగ్ చేయగా, వెలగపూడి, గణబాబు బ్యాటింగ్ చేశారు. అలాగే వీఎంఆర్డీఏ చైర్మన్, కమిషనర్ ఒకవైపు, ప్రజా ప్రతినిధులు మరోవైపు ఉండి 'టగ్ ఆఫ్ వార్' ఆడగా వీఎంఆర్‌డీఏ గ్రూప్ గెలిచింది. ఇలాంటి క్రీడల వల్ల ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధి కాశీవిశ్వనాథం, సీపీవో హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా గ్రీన్‌బెల్ట్ కబ్జా

... 5వ పేజీ తరువాయి

అనుకునే సరుగుడు కర్రల విక్రయ కేంద్రం ఏర్పాటుచేశారు. వాటికి ఎదురుగా జాతీయ రహదారికి మరోవైపు జీవీఎంసీ పేరుతో ఒకరు వాహనాల రిపేరు చేసే మెకానిక్ షెడ్‌ను ఏర్పాటుచేసి గ్యారేజీగా మార్చేశారు. హనుమంతవాక జంక్షన్ సమీపంలో ఒకరు నర్సరీని గ్రీన్ బెల్ట్‌లోనే ఏర్పాటుచేశారు. వెంకోజీపాలెం జంక్షన్ వద్ద పాత ఇంటి సామగ్రి విక్రయించే దుకాణాలు, సరుగుడు దుకాణాలు, కార్పెంటర్ల దుకాణాలు వెలిశాయి. ఇసుకతోట జంక్షన్ సమీపంలో గ్రీన్‌బెల్ట్‌ను పూర్తిగా తొలగించేసి కార్ డెకార్స్, మెకానిక్ షెడ్‌లు, మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ సమీపంలో ఏకంగా ఫ్రీ వెండింగ్‌జోన్ పేరుతో ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, గురుద్వార శ్మశానవాటిక పక్కన కారు, ఏసీ రిపేర్లు చేసే మెకానిక్ గ్యారేజీ ఏర్పాటుచేసేశారు. మర్రిపాలెం పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో ఎండుగడ్డిపైకప్పుతో ఒక షెడ్ నిర్మించేసి అందులో ఆవులు పెంపకం చేస్తున్నారు.

గ్రీన్‌బెల్ట్ ఆక్రమణకు గురవుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులుగానీ, ఇంజనీరింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎవరైనా గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళితే ఆ విషయం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చూసుకోవాలని, వారు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కూడా కళ్లముందు ఆక్రమణలు కనిపిస్తున్నా జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదుచేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా అధికారులు గ్రీన్‌బెల్ట్ ఆక్రమణపై జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో గ్రీన్‌బెల్ట్ పూర్తిగా కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు.

నేడు స్వాతంత్ర్య దినోత్సవ సైకిల్ ర్యాలీ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం 'స్వాతంత్ర్య దినోత్సవ సైకిల్ ర్యాలీ' నిర్వహించనున్నామని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. ఉదయం 6:30 గంటలకు టౌన్‌షిప్ తృష్ణా మైదానం నుంచి ర్యాలీ ప్రారంభం కానుందని తెలిపారు. ఈ ర్యాలీకి ఉక్కు ఉద్యోగులు, ప్రజలు హాజరుకావలని కోరారు.

కార్పొరేటర్లకు పలువురి అభినందనలు

గోపాలపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సభ్యుడిగా ఎన్నికైన 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్‌కు గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన నివాసంలో శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

అగనంపూడి, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్ మొల్లి ముత్యాలను స్థానిక టీడీపీ నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందులో భాగంగా తలారివానిపాలెం వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని విస్తరించే విధంగా చొరవ తీసుకోవాలని, అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వీధి ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో వీధి దీపాల ఏర్పాటు

గాజువాక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జోన్ పరిధిలో వార్డుకు 70 చొప్పున వీధి దీపాలు మంజూరయ్యాయి. వార్డులో ఎక్కడైతే లైట్లు లేవో అక్కడ కొత్త లైట్లు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇంతకముందే కార్యాలయానికి లైట్లు చేరుకున్నప్పటికీ, అవి బిగించేందుకు అవసరమైన క్లిప్పింగులు లేకపోవడంతో కొంత మేర జాప్యమైంది. ఇప్పుడు అన్ని వస్తువులు కూరడంతో కొత్త లైట్లు ఏర్పాటు చస్తున్నామని జోనల్ అధికారులు తెలిపారు. రెండేళ్లగా చీకటిమయంగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు లైట్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రికి స్ట్రక్చర్ వితరణ

అగనంపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోగులు, గర్భిణులకు రోటరీ క్లబ్ అందిసున్న సేవలు అభినందనీయమని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపికృష్ణ పేర్కొన్నారు. విశాఖ సౌత్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోగులను తీసుకువెళ్లేందుకు స్ట్రక్చర్ ట్రాలీ సూపరింటెండెంట్ చేతుల మీదగా అందజేశారు. అలాగే గర్భిణులకు ప్రోటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వి. శివకుమార్‌రెడ్డి, వై. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బడికి వెళ్లాలంటే రోడ్డు దాటాల్సిందే!

» రద్దీ కూడళ్లు, జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న విద్యా సంస్థలు » సమస్యను పరిష్కరించాలని సీపీని వేడుకుంటున్న తల్లిదండ్రులు





రోడ్డు దాటుకుంటూ పాఠశాలలకు, కళాశాలలకు వెళుతున్న విద్యార్థులు

ఆటోనగర్,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులు పక్కనే కొని పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయడంతో రోడ్డు దాటుకుని వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే రహదారులను దాటే సమయంలో ఏమన్నా అవుతుందనే ఆందోళన విద్యార్థుల్లో ఉంది. ఈ క్రమంలో జీవీఎంసీ 70వ వార్డులో సుమారు 20 కాలనీల విద్యార్థులు జాతీయ రహదారి మీదుగా చైతన్య నగర్‌లో ఉండే పాఠశాలలకు, కళాశాలలకు వెళుతున్నారు. కేవలం ఈ కాలనీల నుంచే సుమారు 14వేల మంది విద్యార్థులు వెళుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారుల్లో ఏడాది కాలంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. దీంతో ఈ ప్రాంత విద్యార్థులు ప్రతి



పాఠశాల విడిచిపెట్టే సమయంలో ట్రాఫిక్ జామ్

రోజు బిక్కుబిక్కుమంటూ పాఠశాలలకు, కళాశాలలకు వెళుతున్నారు. అన్ని విద్యాసంస్థలు ఒకే సమయానికి ప్రారంభమవడం, ముగియడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. ఆ సమయాల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ శంకబ్రత బాగ్చీని తల్లిదండ్రులో కోరుతున్నారు. సాయంత్రం విద్యార్థులు ఇంటికి వచ్చే సమయంలో కొంత మంది ఆకతాయిలు, అల్లరి చేసుకుంటూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థినులను అల్లరి చేస్తున్నారని, వారి మీదు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులను విడిచి పెట్టు సమయాల్లో ఒక్కో విద్యా సంస్థలకు కనీసం 5 నిముషాలు వ్యత్యాసం ఉండేలా అధికారులు నోటీసులు పంపితే కొంత మేర ట్రాఫిక్ సమస్య నివారించవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు మేలు చేకూరే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరతున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

» ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు



జస్టిస్ లక్ష్మణరావును సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ఏపీ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు అన్నారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు 'న్యాయ విద్య సమకాలీన పరిస్థితులు' అనే అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో మెలగుతూ.. లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. వ్యాట్ ట్రిబ్యునల్ ఛైర్మన్ ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ నేర్చుకోవడంలో నాలుగు దశలు ఉన్నాయని, ప్రతి దశలోనూ లక్ష్యాన్ని చేరుకున్నప్పుడే ఉన్నతి స్థితికి చేరుకోగలరన్నారు. వర్సిటీ వీసీ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రతి శనివారం ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎస్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్ కొండవాలు ప్రాంతాల్లో రూ.37లక్షల కార్పొరేషన్ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తునట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్ , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలను ప్లాంటు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల్లో ప్లాంట్ డైరెక్టర్ సురేశ్‌చంద్ర పాండే(పర్సనల్), డైరెక్టర్(ఆపరేషన్స్) సలీం జీ. పురుషోత్తం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలందరూ కలిసికట్టుగా ఉండాలని అన్నారు. అనంతరం గిరిజన నృత్యాలు, ధింసా నృత్యం విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ ఎం. మధుసూదన్‌రావు, జీఎం ఎన్.భాను, డీజీఎం రాధిక తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్‌లు, అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి భెల్ యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని డీజీఎం ఎస్.లీలా అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్ కార్యవర్గ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మినీ పార్కులకు మోక్షం

గాజువాక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉడా డబుల్ రోడ్డులో అభివృద్ధికి నోచుకోని వీఎంఆర్‌డీఏ పార్కులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ పార్కుల అభివృద్ధిపై వీఎంఆర్‌డీఏ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో పార్కుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను మొత్తం తొలగించే పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. గాజువాక కణితి రోడ్డు నుంచి పంప్‌హౌస్ వరకు ఉడా కాలనీకి ఆనుకుని ఉన్న రోడ్డులో ఏడేళ్ల క్రితం తొమ్మిది మినీ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. కేవలం ప్రహరి మాత్రమే నిర్మించి విడిచిపెట్టడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయి అడవిని తలపించేది. ఈ స్థలాలను కార్యక్రమాలు, వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ఉపయోగించుకునేవారు. ఇప్పుడు పార్కులు అభివృద్ధి చేయడంతో సందర్శకులు అధిక సంఖ్యలో తరలివస్తారిన స్థానికులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించినందుకు కాలనీవసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'వారానిక ఒక మొక్క నాటుదాం'

» కార్యక్రమానికి నేడు శ్రీకారం

మల్కాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'వారానికి ఒక మొక్క నాటుదాం' అనే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా తొలి మొక్కను దుర్గానగర్ కొండపై ఉన్న దుర్గాదేవి ఆలయం వద్ద మల్లేశ్వర రెడ్డి నాటనున్నారు. ఈ కార్యక్రమానికి పట్నాన కృష్ణారెడ్డి ఆర్థిక సాయం చేయనున్నారు. భావి తరాలక స్ఫూర్తినిచ్చేలా ప్రతి ఒక్కరు వారినికి ఒక మొక్క నాటాలని, భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని ఇవ్వడమే ప్రధమ ధ్యేయంగా పెట్టుకోవాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే గణబాబుకు రాఖీ కడుతున్న మహిళలు

రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కు రాఖీ కడుతున్న మహిళలు

గోపాలపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ వేడకలను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కార్యాలయంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 91వ వార్డు టీడీపీ నాయకురాలు బొడ్డేటి ఉమ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు, డ్వాక్రా సంఘాల మహిళలు గణబాబుకు రాఖీలు కట్టారు. అనంతరం మహిళలకు గణబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్పీలు, వార్డు కమిటీ సభ్యులు.

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ సందర్భంగా సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు మహిళలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి పార్వతి, మంతా నాగసుధ, గొంతిన హైమావతి, మడక గౌరీ పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు చీరల పంపిణీ

వితంతువులకు, ఒంటరి మహిళలను తన తోబుట్టువులుగా భావిస్తూ రాఖీ పౌర్ణమి సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో 200 మందికి పంచకర్ల రమేశ్‌బాబు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాఖీ కానుకగా చీరలు అందజేస్తున్నామన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు పాల్గొన్నారు. పెందుర్తి పోలీసు స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు.

సామూహిక సత్యనారాయణస్వామి కల్యాణం

శ్రీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా జీవీఎంసీ 71 వార్డు శ్రీనగర్‌లో శ్రీకృష్ణ గోవర్ధన గిరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి కల్యాణాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తలంబ్రాలు, సప్తపదులు, మాంగళ్యధారణ, జీలకర్ర-బెల్లం తదితర సన్నివేశాలు భక్తులను విషేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ వేడుకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి భూషణ శర్మ పర్యవేక్షణలో జరిగాయి.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 62, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ(పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం(పాతది) 70, బరబాటి 22, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, దోసకాయలు20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు34, చిలగడదుంపలు 44, కంద 40, , గోరు చిక్కుడు 34, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో)35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర(కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిదగు మ్మడికాయ 20, కర్రపెండలం 24, మామి డిఅల్లం56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

మన్యంలో ముఖ్యమంత్రి


వంజంగి గ్రామంలో శంకుదేవుడికి పూజలు చేస్తున్న ముఖ్యమంత్రి



అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగి గ్రామంలో ఆశ వర్కర్లు, గిరిజన మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


అరకు కాఫీ తాగుతూ..

అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగి, లగిశపల్లిల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పర్యటించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజనులతో చంద్రబాబు మమేకమయ్యారు. గిరిజనుల వంటలను రుచిచూశారు. వారి దేవుళ్లకు పూజలు చేశారు. సంప్రదాయ విత్తనాల గురించి తెలుసుకున్నారు. గిరిజన మహిళలతో రాఖీలు కట్టించుకున్నారు. అంగన్‌వాడీ బాలలను పలకరించారు. అరకు కాఫీ రుచి చూశారు.


గిరి మహిళ ఇంట ఆతిథ్యం స్వీకరిస్తూ..


గుమ్మడి పాదును పరిశీలిస్తున్న చంద్రబాబు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి గుమ్మడి సంధ్యారాణి


వంజంగిలో గిరిజన మహిళలు ప్రదర్శిస్తున్న విత్తనాలను ఆసక్తిగా తిలకిస్తున్న చంద్రబాబు నాయుడు



రక్షా బంధన్ సందర్భంగా చంద్రబాబుకు రాఖీ కడుతున్న మంత్రి సంధ్యారాణి, 'మార్గదర్శి' గిరిజ, గిరిజన మహిళ మణి


కాఫీ తోటలను పరిశీలిస్తున్న చంద్రబాబు



జీసీసీ ఉత్పత్తుల రిటైల్ మార్కెటింగ్‌కు ట్రైఫెడ్‌తో ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

షెడ్యూల్ ప్రకారం బస్సులు నడవాల్సిందే..

- 15 నుంచి ప్రారంభమయ్యే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంలో ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బస్సులన్నీ షెడ్యూల్స్ టైమింగ్ ప్రకారం తప్పనిసరిగా నడవాల్సిందేనని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ట్రాఫిక్ అధికారులకు ఆదేశించారు. ఈ నెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం కానున్నందున మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా రవాణా సేవలందించాలని సూచించారు. శనివారం ఉదయం ఆయన తమ కార్యాలయంలో బస్సుల నిర్వాహణ, షెడ్యూల్ టైమ్, బస్ స్టేషన్‌ల నిర్వహణ, తదితర అంశాలపై ట్రాఫిక్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్‌స్టేషన్లు, బస్టాపుల వద్దకు వచ్చే ప్రయాణికులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్దేశించిన సమయానికే బస్సులను నడపాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కేంద్ర కార్యాలయ ఆదేశాల మేరకు అవసరమైన బస్సులను సిద్ధం చేసుకుని సిద్ధం చేసుకుని మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయాలన్నారు. ఈ పథకం ప్రారంభంలో ఎదురయ్యే ఇబ్బందులను ఆ తరువాత రోజుల్లో సరిదిద్దుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆర్ఎం సూచించారు. సమావేశంలో సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ ఎస్ఎస్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ద్వారకా బస్ స్టేషన్, సింహాచలం కాంప్లెక్స్‌లను ఆర్ఎం పరిశీలించారు.

పలు రైళ్లకు ప్రయోగాత్మక అదనపు హాల్ట్‌లు

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల డిమాండ్ మేరకు రైల్వే బోర్డు ఆదేశాలతో పలు రైళ్లకు వివిధ స్టేషన్లలో ప్రయోగాత్మక హాల్ట్‌లు కల్పించనున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 15 నుంచి విశాఖ-కోర్బా-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18518/18517) మురిబహల్ స్టేషన్‌లో, ధనబాద్-అలెప్పీ-ధన్‌బాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (13351/13352) అంబోదల స్టేషన్‌లో, అమృతసర్-విశాఖ-అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20808/20807) నారజ్ మార్థాపూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పించనున్నారు. ఈ నెల 15, 16 తేదీల నుంచి విశాఖ-నిజాముద్దీన్-విశాఖ సమతా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12808/12807) తెరుబాలిలో, బిలాస్‌పూర్-తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (17481/17482) అంబోదల, తెరుబాలి స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. అలాగే ఈనెల 14, 15వ తేదీల నుంచి జగదల్‌పూర్-భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18448/18447) భూసందపూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పించనున్నారు.

క్రీడా దినోత్సవ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ద ఒలింపిక్ సంఘం విశాఖ ఆధ్వర్యంలో ప్రతిభగల క్రీడాకారులతోపాటు కోచ్‌లు, పీఈటీల ప్రోత్సాహక అవార్డులు అందించనున్నట్టు ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించి క్రీడాకారులు, కోచ్‌లు, పీఈటీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. గత ఏడాది సెప్టెంబరు ఒకటి నుంచి ఈ ఏడాది ఆగస్టులోపు వివిధ క్రీడాంశాలలో ప్రతిభ చూపిన క్రీడాకారులు, కోచ్‌లు, పీఈటీలు అర్హులని తెలిపారు. అవార్డులకు దరఖాస్తు చేసేవారు విశాఖకు చెందినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాలకు చెందిన వారికి అవకాశం ఉండదన్నారు. ఈ ఎంపికలకు సంబంధించి దఒలింపిక్ సంఘంలోని ప్రతినిధులను కమిటీలుగా నియమించామని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 98662 51112 నంబరుకు సంప్రదించాలని కోరారు.

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపునకు టీడీపీ అడ్డదారులు

- శాసన మండలి విపక్ష నేత బొత్స ఆరోపణ


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే లక్ష్యంతో టీడీపీ అడ్డదారులు తొక్కుతోందని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పోలింగ్ బూత్‌లను మార్చేశారన్నారు. ఒక గ్రామంలోని ఓటర్లను శివారు గ్రామంలో పెట్టడం సమంజసమా? అని ప్రశ్నించారు. గతంలో తాను ఎప్పుడూ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చూడలేదన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల్లో పోలీసులు, టీడీపీ నేతలు కలిసిపోయి పనిచేస్తున్నారని విమర్శించారు. పోలీసుల ప్రోత్సాహంతోనే ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేశారని ఆరోపించారు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు. తమ ప్రభుత్వ హయాంలో భూకుంభకోణాలు జరిగాయని కూటమి నేతలు ఆరోపించారని, గత 14 నెలల కూటమి పాలనలో ఒక్కటైనా నిరూపించారా?...అని బొత్స ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖలో భూదోపిడీ జరుగుతోందనే ప్రచారం నేపథ్యంలో విచారణ కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ రాశామన్నారు. విశాఖ, విజయవాడల్లో బహిరంగంగానే హత్యలు జరిగిపోతున్నాయని, పోలీస్ వ్యవస్థ అంటేనే ప్రజల్లో గౌరవం పోయిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు ప్రతిపక్షంగా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే వివేకానందరెడ్డి హత్య జరిగిందని, అప్పట్లో సీబీఐకు దర్యాప్తు అప్పగించాలని డిమాండ్ చేస్తే పట్టించుకోకపోవడంతో తమ ప్రభుత్వ హయాంలో సీబీఐకి అప్పగించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా కేసును రాజకీయంగా వాడుకున్నారే తప్ప, దోషులకు శిక్షపడేలా చేయలేదన్నారు.

హాస్టళ్లలో ఉత్తమ బోధన

- విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు
- పనితీరు ఆధారంగా వసతిగృహాలకు ర్యాంకులు
- బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, చిత్రంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో చదివే విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, విలువలతో కూడిన బోధన చేసి ఉత్తమ పౌరులగా తీర్చిదిద్దాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సూచించారు. శనివార జడ్పీ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమశాఖ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్ల సదస్సు జరిగింది. ఈ సదస్సును జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించిన అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ పురాతన చరిత్రలు చూస్తే గురుకులాల్లో చదువు, క్రమశిక్షణ, అనేక విషయాలనే బోధించి వారికి సమాజంలో మంచి పౌరులుగా తయారుచేశారని గుర్తుచేశారు. అలాంటి విద్యను హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులకు అందించినప్పుడే మంచి సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచడం, రుచికరమైన భోజనాన్ని అందించడం, ఆరోగ్యకరమైన పరిసరాలు ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. హాస్టళ్ల వార్డెన్లు విధిగా తాము పనిచేసే చోట నివాసం ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిభ, పనితీరు, నిర్వహణ, పరీక్ష ఫలితాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని హాస్టళ్లు, గురుకులాలకు ర్యాంకులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ తాను విజయనగరం జిల్లా జొన్నలవలస బీసీ హాస్టల్‌లో ఉండి చదువుకున్నానన్నారు. అంకిత భావంతో హాస్టళ్లను నిర్వహిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకుంటారనడానికి తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ ఉన్నతమైన విలువలను పాటిస్తూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే సత్తా వార్డెన్లకు ఉంటుందన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ, ఇన్‌చార్జి విశాఖ బీసీ వెల్ఫేర్ అధికారి కె.రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ డి.చంద్రశేఖర్, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల డైరెక్టర్ పి. మాధవీలత, జేడీ చినబాబు, ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ వెల్ఫేర్ అధికారులు శ్రీదేవి, జ్యోతిశ్రీ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు


ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. శనివారం తెల్లవారిజామునే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వందలాది మంది సింహా చలం చేరుకున్నారు. కొండ దిగువ పుష్కరిణిలో స్నానాలు చేసి సమీపంలోని భైరవస్వామిని దర్శించుకుని అమృతకలశాలను సమర్పించారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో కేశఖండన శాల, ప్రసాదాల విక్రయ కేంద్రాలు, అన్నప్రసాద భవనం కిటకిలాడాయి.

44 గ్యాస్ సిలెండర్లు స్వాధీనం

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలుచోట్ల వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను పౌరసరఫరాలశాఖ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. జేసీ ఆదేశాలతో మూడు బృందాలుగా ఏర్పడిన అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు పలుచోట్ల దాడులు చేసి 44 గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు. గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను బహిరంగ ప్రదేశాలు, వాణిజ్య సంస్థల్లో నిల్వ చేయడం, వ్యాపార అవసరాలకు వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింహాద్రి అప్పన్న ఆభరణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు

సింహాచలం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు సమర్పించిన ఆభరణా లను ఫైవ్‌మేన్ కమిటీ శనివారం తనిఖీ చేసింది. కడప జిల్లాకు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త ప్రభాకరాచారి కలెక్టర్‌కు స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు దేవదాయ శాఖ జోన్-1 ఆర్‌జేసీ హోదాలో ప్రస్తుత ఈఓ వేంద్ర త్రినాథరావు ఫైవ్‌మెన్ కమిటీని ఆభరణాల తనిఖీకు నియమించారు. కమిటీ ఈనెల 7, 8న తేదీల్లో ఆలయానికి రావాల్సి ఉంది. మూడో శ్రావణ శుక్రవారం కావడంతో కమిటీ సభ్యులు పర్యటనను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈమేరకు శనివారం ఆలయ పద్మనిధిలోని రజిత, స్వర్ణ ఆభరణాలను రికార్డులతో సరిపోల్చి తూనిక వేశారు. అలాగే ఆలయంలో స్వామివారిపైన, అర్చకుల వద్ద ఉన్న ఆభరణాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు తాము నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి తేడా కనిపించలేదని చెప్పారు. తనిఖీల్లో అరసవల్లి దేవస్థానం ఈఓ కమ్ విజయనగరం జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, దేవదాయ శాఖ. జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ వీవీ పల్లంరాజు, అంతర్వేది దేవస్థానం ఈఓ ప్రసాద్, కాకినాడ ఆర్‌జేసీ కార్యాలయం పర్యవేక్షణాధికారి సుబ్రహ్మణ్యం, సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, సింహాచల దేవస్థానం గోల్డ్‌స్మిత్ పండూరి సాంబమూర్తి, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.